16న గ్రీవెన్స్ రద్దు

పార్వతీపురం, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి) : మిలాద్ ఉన్ నబి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను రద్దు చేసినట్లుగా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు. వ్యయ ప్రయాసలకు గురవుతూ జిల్లా కేంద్రం పార్వతీపురానికి ఎవరూ రావొద్దని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో అధికారులు కూడా తమ పరిధిలో ప్రజలకు ఈ విషయాన్ని తెలియజేయాలన్నారు.

జీవో గుబులు

- 115 జీవోపై స్టాఫ్ నర్సుల మండిపాటు
- తక్షణమే రద్దు చేయాలని డిమాండ్
- జిల్లాలో కొద్ది రోజులుగా నిరసన
- దశాబ్దాలుగా పనిచేస్తున్న తమకు న్యాయం చేయాలని విన్నపం



జిల్లా కేంద్రాసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

పార్వతీపురం, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో కీలకంగా వ్యవహరించే స్టాఫ్‌నర్సులను జీవో నెంబర్ 115 కలవరపరుస్తోంది. ఆ శాఖ ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయం.. వారిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతాలతో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న స్టాఫ్ నర్సులను కాదని సచివాలయ ఏఎన్ఎంలకు పదోన్నతి కల్పించేందుకు విడుదల చేసిన జీవోపై వారు మండిపడుతున్నారు. దీనివల్ల తమ ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లనుందనే భయంతో రెడ్డెక్కారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా కొద్దిరోజులుగా జిల్లాలో ఆసుపత్రుల వద్ద నల్ల రిబ్బన్లు ధరించి నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. అధికారులు ఈ ఉత్తర్వులు ఇచ్చి ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టిస్తున్నారని, జీవో 115ను రద్దు చేసే వరకూ పోరాటం సాగిస్తామని వారు స్పష్టం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో సుమారు 200 మందికి పైగా స్టాఫ్ నర్సులు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్నారు. దశాబ్దాలుగా గిరిజన, మైదాన ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఎప్పటికైనా తమను రెగ్యులర్ చేస్తారనే ఆశతో సేవలందిస్తున్నారు. అయితే సచివాలయాల ఏఎన్ఎంలకు స్టాఫ్‌నర్సులుగా పదోన్నతి కల్పించాలని జీవో నెంబర్ 115ను జారీ చేయడంతో వారు ఆందోళన బాట పట్టారు. ఈ జీవో వల్ల భవిష్యత్తులో తాము రెగ్యులర్ అయ్యే పరిస్థితి కనిపించడం లేదని వారు వాపోతున్నారు. సకాలంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని భావిస్తున్నారు. వారికి వైద్యులతో పాటు రెగ్యులర్ స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు కూడా మద్దతు తెలుపుతున్నారు. నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరవుతున్నారు. వాస్తవంగా స్టాఫ్‌నర్సులుగా నియామకం కావాలంటే నాలుగేళ్ల జీఎన్ఎం లేదా బీఎస్సీ నర్సింగ్ కోర్సు చేయాలి. కానీ సచివాలయ ఏఎన్ఎంలకు శిక్షణను నేరుగా స్టాఫ్ నర్సులు నియమించాల నుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే ప్రభుత్వం స్పందించి జీవో నెంబర్ 115ను రద్దు చేయాలని స్టాఫ్ నర్సులు, వైద్య సిబ్బంది కోరుతున్నారు.

తీవ్రంగా ఖండిస్తున్నాం..



కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న స్టాఫ్ నర్సులకు నష్టం కలిగించే జీవో నెంబర్ 115ను వెంటనే రద్దు చేయాలి. ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న స్టాఫ్ నర్సులను కాదని సచివాలయ ఏఎన్ఎంలకు పదోన్నతి కల్పించడం దారుణం. దీనిని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం.

-పీవీ చంద్రసాయి, హెడ్ నర్స్, జిల్లా కేంద్రాసుపత్రి, పార్వతీపురం

రెగ్యులర్ చేయాలి..



కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న స్టాఫ్ నర్సును రెగ్యులర్ చేయాలి. మాకు నష్టం కలిగించే విధంగా జారీ చేసిన 115 జీవోను రద్దు చేయాలి. మా సర్వీసులను గుర్తించాలి.

-గౌతమి, స్టాఫ్‌నర్స్, జిల్లా కేంద్రాసుపత్రి, పార్వతీపురం

జీవోలను రద్దు చేయాలి..



జీవోలు 115, 143లను తక్షణమే రద్దు చేయాలి. వాటి వల్ల వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోనున్నారు. ఇటీవల జిల్లాకు వచ్చిన ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు కూడా ఈ విషయాన్ని తెలియజేశాం. ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

-జీవీఆర్ఎస్ కిషోర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సంఘం నాయకుడు, పార్వతీపురం

న్యాయం చేయండి

- జిల్లా కేంద్రంలో మూడో రోజు స్టాఫ్ నర్సుల నిరసన

బెలగాం, సెప్టెంబరు 13: తమకు న్యాయం చేయాలని స్టాఫ్ నర్సులు డిమాండ్ చేశారు. శుక్రవారం మూడో రోజు పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రిలో వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. కొన్నేళ్లుగా స్టాఫ్ నర్సులుగా సేవలందిస్తున్న తమకు న్యాయం చేయాలని, నోటిఫికేషన్ ద్వారా పోస్టులను భర్తీ చేయాలని నినాదాలు చేశారు. ఎన్నో ఏళ్లుగా సేవలం దిస్తున్న తమని కాదని, సచివాలయాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలకు శిక్షణ ఇచ్చి స్టాఫ్ నర్స్‌లుగా పదోన్నతి కల్పించేం దుకు జీవో 115ను విడుదల చేయడం దారుణమన్నారు. మూడున్నరేళ్ల జీఎన్ఎం, నాలుగేళ్ల బీఎస్సీ నర్సింగ్ కోర్సు చదివి తాము సేవలు అందిస్తున్నామని స్పష్టం చేశారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ నిరసనలో స్టాఫ్ నర్స్‌లు గౌతమి, స్వాతి, సాయికుమారి, పద్మజ, కన్నమ్మ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై
ప్రత్యేక శ్రద్ధ

- సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పాలకొండ: వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పాలకొండ సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం చినమంగలాపురం జడ్పీ స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి అసంతృప్తి చెందారు. భోజనం రుచిగా లేదని, ఇంకా మెరుగ్గా వండి విద్యార్థులకు భోజనం పెట్టాలని సూచించారు. విద్యార్థులకు నేరుగా పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఆ తర్వాత వారి నోట్‌పుస్తకాలను పరిశీలించారు.

పీసా ఎన్నికలు నిర్వహించాలి

సీతంపేట: మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో పీసా ఎన్నికలు నిర్వహించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏలో పీసా చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 24 నుంచి అక్టోబరు 8వ తేదీలోపు మండలంలోని 102 గ్రామ సభలు నిర్వహించి అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకోవాలని సూచించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. ఏపీవో చినబాబు, తహసీల్దార్ అప్పలరాజు, ఎంపీడీవో గీతాంజలి, ఆర్‌వోఎఫ్ఆర్ డీటీ కుమారి, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబెడుతున్న సబ్ కలెక్టర్

కంటైనర్ ఆసుపత్రిని వినియోగించుకోండి

- గిరిజనులకు కలెక్టర్ సూచన

సాలూరు రూరల్, సెప్టెంబరు 13: ఏవోబీలో గిరి శిఖర గ్రామం కరడవలసలో ఏర్పాటు చేయనున్న గిరి ఆరోగ్య కేంద్రం (కంటైనర్ ఆసుపత్రి)ని సమీప గ్రామాల గిరిజనులు వినియోగించుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సూచించారు. శుక్రవారం కంటైనర్ ఆసుపత్రిని పరిశీలించారు. ఇందులో ఉన్న నాలుగు బెడ్‌లు, డాక్టర్ రూం తదితర వాటి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రి ఫ్లోర్ కిందకు కుంగడంతో దానిని సరిచేయాలని ఆదేశించారు. ఈ ప్రాంతంలో గర్భిణులకు రక్తహీనత లేదని, ప్రసవాలకు సాలూరు, తోణాం వస్తారని వైద్యులు తెలిపారు. కంటైనర్ ఆసుపత్రి ద్వారా పది గ్రామాలకు చెందిన 1500 మంది గిరిజనులకు సేవలందనున్నట్లు చెప్పారు. అనంతరం కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. సరుకులు అందుతున్నాయని వారు చెప్పారు. ఆ తర్వాత గర్భిణులకు సీమంతం నిర్వహించారు. వచ్చే ఏడాది సీతాఫలాలకు గిట్టుబాటు ధర వచ్చేలా కార్యాచరణ రూపొందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జీడిలో అంతర పంటగా పైనాపిల్‌ను సాగు చేయాలని గిరిజన రైతులకు సూచించారు. ఎంపీడీవో పార్వతి, సీడీపీవో విజయలక్ష్మి, తోణాం పీహెచ్‌సీ వైద్యుడు అజయ్ తదితరులు పాల్గొన్నారు.



కంటైనర్ ఆసుపత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్‌కు వినతులు

కరడవలసలో రేషన్ డిపో ఏర్పాటు చేయాలని , నారింజపాడు, బెల్లపాక, బొడ్డపాడుకు రోడ్లు నిర్మించాలని, జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరారు. దీనిపై గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సీదరపు అప్పారావు, కరడవలస సర్పంచ్ పాలిక శంకర రావు కలెక్టర్‌కు విన్నవించారు.

పెద్దగెడ్డ పరిశీలన

పాచిపెంట : పెద్దగెడ్డ రిజర్వాయర్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పరిశీలించారు. రిజర్వాయర్‌ను పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. మ్యాపింగ్ గ్రాంటు నిధులతో కెనాల్ నిర్వహణ, మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని, పి.కోనవలస చెక్‌పోస్టు, పాచిపెంటలో జడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులు, రక్తహీనతతో బాధపడుతున్న వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. జల వనరులశాఖ అధికారులు, ఆర్డీవో కె.హేమలత, హెచ్ఎం బి.ఈశ్వరరావు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శంబరలో పర్యటన

మక్కువ: శంబరలో పోలమాంబ అమ్మవారిని శుక్రవారం కలెక్టర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వనం గుడి ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. సిరిమాను తిరిగే ప్రాంతంలో రహదారుల నిర్మాణం, గ్రామంలో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణానికి చర్యలు చేపడతామన్నారు. జాతరలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని, ఇందుకు గ్రామస్థులు కూడా సహకరించాలని కోరారు. భక్తుల కోసం విశ్రాంతి షెడ్లు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం జాతర స్థలాన్ని, చదురు గుడి పరిసరాలను పరిశీలించారు. తహసీల్దార్ షేక్ ఇబ్రహీం, ఎంపీడీవో సూర్యనారాయణ, ఎస్ఐ రమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పీఎం జన్‌మాన్
సర్వే పరిశీలన

గుమ్మలక్ష్మీపురం: ఎస్.కె.పాడు గ్రామంలో చేపడుతున్న ప్రధానమంత్రి జన్‌మాన్ సర్వేను శుక్రవారం జేసీ శోభిక పరిశీలించారు. ప్రతి ఇంటిని సర్వే చేసి గ్రామంలో ప్రతిపాదనలపై తుది నివేదిక అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి గ్రామానికి కావాల్సిన ఇళ్లు, రహదారులు, నీరు వంటి అంశాలను పరిశీలించి కచ్చితమైన నివేదిక సమర్పించాలన్నారు. ఈ పథకం కింద గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించనున్నట్లు గ్రామస్థులకు తెలిపారు. అనంతరం గుమ్మలక్ష్మీపురం వైటీసీలో గిరిజన గర్భిణుల వసతి గృహాన్ని పరిశీలించారు. గిరి శిఖర గ్రామాలు, మారుమూల గ్రామాల్లో ఉన్న గర్భిణులను ప్రసవాలకు ముందే ఇక్కడకు తీసుకురావాలని సిబ్బందికి సూచించారు.



సర్వే సిబ్బందికి సూచనలిస్తున్న జేసీ

పార్వతీపురంలో వందేభారత్ హాల్ట్‌కు హామీ!

పార్వతీపురం, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి) : పార్వతీపురంలో వందేభారత్ హాల్ట్‌కు రైల్వే సహాయ మంత్రి హామీ ఇచ్చినట్లు శుక్రవారం రాత్రి సామాజిక మాధ్యమాల ద్వారా తెలిసింది. వాస్తవంగా ఈ నెల 15 నుంచి దుర్గ-విశాఖపట్నం మధ్య వందేభారత్ ప్రారంభం కానుంది. అయితే పార్వతీపురంలో స్టాప్ లేకుండానే రైల్వే అధికారులు ట్రైన్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ మేరకు ట్రైల్ రన్ కూడా నిర్వహించారు. పార్వతీపురం, టౌన్ రైల్వే స్టేషన్‌ల్లో వందే భారత్‌ను నిలుపలేదు. దీనిపై స్పందించిన పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర విశాఖపట్నంలోని డీఆర్ఎం తదితర అధికారులను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఆ తర్వాత రైల్వేశాఖ సహాయ మంత్రి సోమన్నను డిల్లీలో కలిసి సమస్యను వివరించారు. దీంతో పార్వతీపురంలో వందేభారత్ హాల్ట్‌పై రైల్వే సహాయ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.



రైల్వే సహాయ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

కిశోర బాలికల్లో రక్తహీనత నివారించాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహన్‌రావు

పార్వతీపురం, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల్లో రక్తహీనతను నివారించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో టి.జగన్మోహన్‌రావు ఆదేశించారు. శుక్రవారం పార్వతీపురంలో మహాత్మా జ్యోతీరావుపూలే సంక్షేమ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. ఎంతమంది విద్యార్థినులకు హీమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు.. రక్తహీనతగా గుర్తించిన కేసులు ఎన్ని? అని ఆయన సిబ్బందిని ప్రశ్నించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. రక్తహీనతతో బాధపడుతున్న కిశోర బాలికలు రోజూ ఐరెన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వేసుకుని, పూర్తిస్థాయిలో పౌష్టికాహారం తీసుకొనేలా పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం ఆయన జిల్లా ఆసుపత్రిలో పోషకాహార, పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ చేరిన వారిలో బరువు తక్కువ, పోషకాహార లోపంతో ఉన్న పిల్లల ఆరోగ్య వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్‌లో మలేరియా, డెంగ్యూ, నిర్ధారణ పరీక్షలు, నివేదికలను పరిశీలించారు. ఈ పరిశీలనలో డెమో సన్యాసిరావు, సూపర్‌వైజర్ పుష్ప, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

భర్తీ ఎప్పుడో?

- గత నెలలో చినమేరంగి సీఐ, ఎస్ఐ బదిలీ
- ఎల్విన్‌పేట సీఐ, జియ్యమ్మవలస ఎస్ఐలకు అదనపు బాధ్యతలు
- రోజులు గడుస్తున్నా.. ఇన్‌చార్జిలతోనే నెట్టుకొస్తున్న వైనం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

జియ్యమ్మవలస : జియ్యమ్మవలస మండలంలో చినమేరంగి సర్కిల్ ఆఫీసు, పోలీస్‌స్టేషన్లు ఇన్‌చార్జిల పాలనలో కొనసాగుతున్నాయి. సుమారు నెల రోజులు గడుస్తున్నా.. ఇంతవరకు సీఐ, ఎస్ఐలను భర్తీ చేయలేదు. దీంతో నేరాల నియంత్రణ, కేసుల నమోదు విషయంలో సిబ్బంది సూచనలిచ్చేవారే కరువయ్యారు. మరోవైపు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు అవస్థలు తప్పడం లేదనే వ్యాఖ్యలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. వాస్తవంగా చినమేరంగి సీఐగా బి.మంగరాజు విధులు నిర్వహించేవారు. ఆయనకు ఆగస్టు 9న శ్రీకాకుళం జిల్లా పొందూరుకు బదిలీ అయ్యింది. అయితే ఆ సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ ప్రాంత పర్యటన ఉందన్న సమాచారంతో రిలీవ్ అయ్యే అవకాశం లేకుండా పోయింది. ఆ తర్వాత అదే నెల 16న ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. అప్పటి నుంచి చినమేరంగికి సీఐగా ఎవర్నీ నియమించలేదు. దీంతో సర్కిల్ పరిధిలో జియ్యమ్మవలస, చినమేరంగి, గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్లకు పర్యవేక్షించే వారే కరువయ్యారు. ఇకపోతే చినమేరంగి పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా ఇ.చిన్నంనాయుడును శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేస్తూ ఆగస్టు 25న ఉత్తర్వులు అందాయి. అయితే ఇప్పటికీ ఎస్ఐగా ఎవర్నీ నియమించలేదు. చినమేరంగి సీఐగా గుమ్మలక్ష్మీపురం మండలం ఎల్విన్‌పేట సీఐ హరిబాబుకు తాత్కాలికంగా బాధ్యతలు అప్పగించారు. జియ్యమ్మవలస పోలీస్‌స్టేషన్ ఎస్ఐ పి.అనీష్ చినమేరంగి ఎస్ఐగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏదేమైనా సీఐ, ఎస్ఐల భర్తీ విషయంలో తాత్సారం చేయడం తగదని, దీనిపై ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చినమేరంగి సర్కిల్ ఆఫీసు, పోలీస్‌స్టేషన్



27న ఆడలి వ్యూపాయింట్ ప్రారంభం

సీతంపేట: ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 27న ఆడలి వ్యూపాయింట్ ప్రారంభానికి ఐటీడీఏ అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. సీతంపేట, పాలకొండకు అతి సమీపంలో గిరి శిఖర ప్రాంతంలో ఉన్న ఆడలి వ్యూపాయింట్ పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేశారు. సందర్శకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విద్యుత్, రహదారి సదుపాయం కల్పించారు. వారు రాత్రి బస చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. మొత్తంగా రూ.3కోట్లతో ఈ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఇప్పటికే ఈ ప్రాంతానికి పర్యాటకు తాకిడి ఎక్కువగా ఉంది. వెబ్ షూటింగ్‌లు కూడా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి వసతి సమస్య లేకుండా ఇక్కడ టెంట్లను ఏర్పాట్లు చేశారు. మొత్తంగా ఈ ప్రాంతం పర్యాటక హబ్‌గా మారే అవకాశం ఉంది. ఇదే తరహాలో జగపతిపల్లిలో వ్యూపాయింట్‌ను కూడా అభివృద్ధి చేసేందుకు సీతంపేట ఐటీడీఏ అధికారులు సిద్ధమవుతున్నారు.



ఆడలి వ్యూపాయింట్

డా.ఎన్టీఆర్ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల్లో నర్సింగ్ కోర్సులు



విజయవాడలోని డా.ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్(డా.ఎన్టీఆర్ యూహెచ్ఎస్)- బీఎస్సీ నర్సింగ్, పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అనుబంధ కళాశాలల్లో కాంపిటెంట్ అథారిటీ కోటా సీట్లు భర్తీ చేయనున్నారు. ఈ కోటా కింద ప్రభుత్వ నర్సింగ్ కాలేజీల్లో మొత్తం సీట్లు; ప్రైవేట్ అన్ ఎయిడెడ్ మైనారిటీ, నాన్ మైనారిటీ నర్సింగ్ కాలేజీల్లో 60 శాతం సీట్లు అలాట్ చేస్తారు. ప్రతి ప్రోగ్రామ్‌లో 85 శాతం సీట్లను స్థానికులకు కేటాయించారు. మిగిలిన 15 శాతం సీట్లకు స్థానికులు సహా స్థానికేతర అభ్యర్థులందరూ పోటీ పడవచ్చు. వెబ్ కౌన్సెలింగ్ నాటికి సీట్ల వివరాలు ప్రకటిస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

బీఎస్సీ నర్సింగ్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. దీనిలో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు; ఇంటర్ ఒకేషనల్‌తోపాటు బయలాజికల్ అండ్ ఫిజికల్ సైన్సెస్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏఐఎస్ఎస్‌సీఈ/ఐసీఎస్ఈ/ఎస్ఎస్‌సీఈ /హెచ్ఎస్‌సీఈ/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్ అభ్యర్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. సైన్స్ సబ్జెక్టుల్లో జనరల్ అభ్యర్థులకు 45 శాతం; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. ఏపీఈఏపీసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. జనరల్ కేటగిరీలో(దివ్యాంగులు సహా) 40382లోపు; ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీల్లో 48459లోపు ర్యాంక్ సాధించిన వారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.

పోస్ట్ బేసిక్ బీఎస్సీ నర్సింగ్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గుర్తింపు పొందిన బోర్డు/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్ నుంచి ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణతతోపాటు జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కోర్సు పూర్తిచేసి స్టేట్ నర్సింగ్ కౌన్సిల్ గుర్తింపు పొందినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏడాదిన్నర వ్యవధి గల ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024డిసెంబరు 31 నాటికి 21 ఏళ్లు నిండి ఉండాలి. అకడమిక్ మెరిట్, జీఎన్ఎం మార్కుల ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2360; బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1888
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **వెబ్‌సైట్:** https://drntr.uhsap.in

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐఈపీఎండీలో డిప్లొమా

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ మల్టిపుల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఎండీ)కి చెందిన మధురై రీజనల్ సెంటర్- డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రిటేషన్(డీఐఎస్ఎల్ ఐ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. మొత్తం 20 సీట్లు ఉన్నాయి. ఇంగ్లీష్, హిందీ, తమిళం మాధ్యమాల్లో బోధన ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌నకు న్యూఢిల్లీలోని రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఆర్‌సీఐ) గుర్తింపు ఉంది. అభ్యర్థులకు నెలకు రూ.2,000ల స్టయిపెండ్ ఇస్తారు. దివ్యాంగులకు, దివ్యాంగుల తల్లిదండ్రులకు ఇన్‌స్టిట్యూషనల్ ఫీజు ఉండదు. దివ్యాంగుల తోబుట్టువులకు 75 శాతం ఫీజు రాయితీ లభిస్తుంది. హాస్టల్ సౌకర్యం ఉంది.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.200; ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.100; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **చివరి తేదీ:** సెప్టెంబరు 20
- **వెబ్‌సైట్:** www.niepmd.tn.nic.in

రామానుజం నేషనల్ మేథ్స్ ఛాలెంజ్



ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ స్కిల్ డెవలప్‌మెంట్(ఏఐసీటీఎస్‌డీ)- 'రామానుజం నేషనల్ మేథ్స్ ఛాలెంజ్(ఆర్ఎన్ఎంసీ) 2025'కు దరఖాస్తులు కోరుతోంది. మేథ్స్‌లో నేటి తరం విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించేందుకుగాను 'నేషనల్ మేథ్స్ స్కాలర్-2025' కాన్సెప్ట్‌తో ఈ పోటీని నిర్వహిస్తున్నారు. ఇందులో పాల్గొనే విద్యార్థులు మేథమెటిక్స్‌కు సంబంధించి ఆన్‌లైన్ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. దేశవ్యాప్తంగా నాలుగోతరగతి నుంచి పన్నెండోతరగతి చదివే విద్యార్థులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. మేథమెటిక్స్‌లో ఆసక్తి ఉన్నవారు జాతీయ స్థాయిలో తమ స్కిల్స్ ప్రదర్శించేందుకు ఇది సదవకాశం.

ఆన్‌లైన్ ఎగ్జామ్ వివరాలు: అభ్యర్థులు ఇంటి వద్దనే ఆన్‌లైన్ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది. పరీక్ష సమయం 45 నిమిషాలు. ఇందులో 30 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు చొప్పున మొత్తం మార్కులు 60. రుణాత్మక మార్కులు ఉన్నాయి. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ఎగ్జామ్ తేదీ, టైం స్లాట్, ఆన్‌లైన్ ఎగ్జామ్ లింక్ తదితరాలను విద్యార్థుల మొబైల్‌కు ఎస్ఎంఎస్ ద్వారా పంపుతారు.

- నాలుగు నుంచి పన్నెండు వరకు ప్రతి తరగతికీ నిర్దేశించిన ఎగ్జామ్ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

రివార్డులు: పరీక్షలో ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వీరిలో ముగ్గురిని విజేతలుగా ప్రకటిస్తారు. మొదటి బహుమతి కింద రూ.75,000; ద్వితీయ బహుమతి కింద రూ.50,000; తృతీయ బహుమతి కింద రూ.25,000; రన్నరప్‌లుగా నిలిచిన 50 మందికి ఒక్కొక్కరికి రూ.2000; అత్యుత్తమ ప్రతిభ కనబరచిన 100 మందికి ఒక్కొక్కరికి రూ.500ల నగదు ఇస్తారు. విజేతలందరికీ జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న ఏఐసీటీ ఎస్‌డీ సర్టిఫికెట్, నేషనల్ మేథ్ స్కాలర్ ట్రోఫీ అందిస్తారు. సంస్థ అంతర్జాతీయంగా నిర్వహించే వివిధ ప్రాజెక్టులు, టెక్నికల్ ఈవెంట్లు సహా పలు సెమినార్లలో నేరుగా పాల్గొనే అవకాశం కల్పిస్తారు. నేషనల్ మేథమెటిక్స్ సైంటిస్ట్ స్కాలర్‌షిప్ కూడా లభిస్తుంది. రోబోటిక్స్ ఆటోమేషన్ అండ్ కోడింగ్‌లో ట్రెయినింగ్ ఇస్తారు. ప్రథమ బహుమతి విజేతకు ఏడాది, ద్వితీయ బహుమతి పొందినవారికి ఆరు నెలలు, తృతీయ బహుమతి సాధించినవారికి మూడు నెలలు శిక్షణ ఇస్తారు. పోటీలో పాల్గొన్నవారందరికీ సంస్థ పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇస్తుంది.

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.270
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **ఆన్‌లైన్ ఎగ్జామ్ తేదీ:** డిసెంబరు 10
- **ఫలితాలు విడుదల:** డిసెంబరు 20
- **ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు:** డిసెంబరు 30
- **విజేతల లిస్ట్ విడుదల:** 2025 జనవరి 15
- **వెబ్‌సైట్:** aictsd.com

నవ్య | చిత్రజ్యోతి

ఈ నెలలో ఎన్టీఆర్ 'దేవర' మినహా పెద్ద హీరోల చిత్రాలేవి విడుదల లేకపోవడంతో థియేటర్లలో సందడి తగ్గనుంది. అయితే ఆ సందడి కాస్తా ఇప్పుడు సెట్స్‌లో మొదలైంది. హీరోలంతా కొత్త సినిమాల షూటింగ్స్‌తో బిజీగా ఉన్నారు. యువ కథానాయికలు సెట్స్‌లో చెమటోడ్చుతున్నారు. సీనియర్ హీరోలు షూటింగ్స్‌కు సై అంటున్నారు. వీరిలో కొందరు హీరోయిన్లతో డ్యూయెట్లు పాడుతుండగా మరికొందరు విలన్లతో పోరాడుతున్నారు. మొత్తం మీద వరుస చిత్రీకరణలతో తెలుగు కథానాయకులు జోరు మీదున్నారు.

సందడంతా సెట్స్‌పైనే









యాక్షన్ మోడ్‌లో వెంకీ

అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం షూటింగ్ శరవేగంగా సాగుతోంది. పది రోజుల క్రితమే పొల్లాచ్చిలో హీరోయిన్ మీనాక్షి చౌదరితో డ్యూయెట్ పాడుకున్నారు వెంకటేశ్. అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకున్నారో లేదో వెంటనే యాక్షన్ సీక్వెన్స్ కోసం రంగంలోకి దిగారు. ఈ చిత్రం తాజా షెడ్యూల్ రెండు రోజుల క్రితమే హైదరాబాద్‌లో మొదలైంది. ఇందులో ఆయన పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఈ 15 రోజుల షెడ్యూల్‌లో యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు ఇతర తారాగణంపై కీలక ఘట్టాలను తెరకెక్కించనున్నారు. దిల్ రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

కూలీ సెట్స్‌లో నాగ్

మల్టీస్టారర్ చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు నాగార్జున. రజనీకాంత్ కథానాయకుడిగా రూపొందుతున్న 'కూలీ' షూటింగ్ ప్రస్తుతం వైజాగ్‌లో జరుగుతోంది. నాగార్జున్ సెట్స్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆయనపై యాక్షన్ సీక్వెన్స్‌తో పాటు కొంత టాకీపార్ట్‌ను ఈ షెడ్యూల్‌లో తెరకెక్కించనున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో కళానిధి మారన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రుతీహాసన్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

క్లైమాక్స్‌కు మట్కా

కరుణకుమార్ దర్శకత్వంలో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న 'మట్కా' చిత్రం షూటింగ్ క్లైమాక్స్‌కు చేరుకుంది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్టూడియోలో పతాక సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. ఈ పీరియాడిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో మాఫియా నాయకుడి పాత్రలో వరుణ్ తేజ్ సరికొత్త మేకోవర్‌తో అలరించనున్నారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రాన్ని రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు.

రాజాసాబ్ పోరాటం

మారుతి దర్శకత్వంలో ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాజా సాబ్' చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ సాగుతోంది. ప్రభాస్‌తో పాటు ప్రధాన తారాగణం అంతా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటోంది. కొంత టాకీ పార్ట్‌ను పూర్తి చేసిన మారుతి తాజాగా పోరాట ఘట్టాలపై దృష్టి పెట్టారు. రామ్-లక్ష్మణ్ నేతృత్వంలో సాగే ఈ భారీ యాక్షన్ సీక్వెన్స్‌లో ప్రభాస్ పాల్గొంటున్నారు. ఈ షెడ్యూల్ ముగిశాక హనూ రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం షూటింగ్‌లో పాల్గొనేందుకు ప్రభాస్ చెన్నై వెళ్లనున్నారు.

కేరళకు దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. చిత్రీకరణ చివరి దశలో ఉంది. ఈ వారంలో కేరళలో ఓ భారీ షెడ్యూల్‌ను మొదలుపెట్టేందుకు యూనిట్ సన్నాహాలు చేసింది. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌లో విజయ్ పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. అలాగే 'పుష్ప 2' క్లైమాక్స్ షూట్‌ను ముగించే పనిలో అల్లు అర్జున్ బిజీగా ఉన్నారు.

చందు మొండేటి, నాగచైతన్య కలయికలో రూపొందుతున్న చిత్రం 'తండేల్'. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోందని యూనిట్ తెలిపింది. టాకీపార్ట్‌తో పాటు పాటలను చిత్రీకరిస్తున్నారు. చైతూకు జోడీగా సాయిపల్లవి కనిపించనున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాస్ నిర్మిస్తున్నారు. నిఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'స్వయంభూ' షూటింగ్ కొనసాగుతోంది. శర్వానంద్ హీరోగా రామ్ అబ్బరాజు తెరకెక్కిస్తున్న చిత్రం ప్రస్తుతం సెట్స్‌పై ఉంది. సుధీర్ బైరెడ్డి రూపొందిస్తున్న చిత్రం షూటింగ్‌లో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ పాల్గొంటున్నారు. శుక్రవారం నాని 'హిట్ 3' చిత్రీకరణ మొదలుపెట్టారు. సాయిదుర్గ తేజ్ హీరోగా రోహిత్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఇటీవలే రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో అటవీ నేపథ్యంలో సాగే యాక్షన్ పార్ట్‌ను యూనిట్ పూర్తి చేసింది.

విరామం తర్వాత

పవన్ కల్యాణ్ పాలిటిక్స్‌తో బిజీగా మారడంతో షూటింగ్స్‌కు తాత్కాలిక విరామం ఇచ్చారు. 'హరి హర వీరమల్లు, ఉస్తాద్ భగత్‌సింగ్, ఓజీ' చిత్రాలను ఆయన పూర్తి చేయాల్సి ఉంది. అలాగే మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం సెట్స్‌పైకి వెళ్లాల్సి ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న చిత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. 'గేమ్ ఛేంజర్' చిత్రం షూటింగ్‌ను ఇటీవలే పూర్తి చేసిన రామ్‌చరణ్ త్వరలోనే కొత్త సినిమా షూటింగ్‌లోకి అడుగు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. పీరియాడిక్ చిత్రం కావడంతో ప్రస్తుతం ఆయన సరికొత్త మేకోవర్‌తో సిద్ధమవుతున్నారు. 'దేవర' ప్రచార కార్యక్రమాలను పూర్తి చేసిన ఎన్టీఆర్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కే చిత్రం కోసం రంగంలోకి దిగనున్నారు. అక్టోబర్ నుంచి షూటింగ్ మొదలుపెట్టనున్నట్లు యూనిట్ తెలిపింది. ఎన్టీఆర్ డిసెంబర్‌లో సెట్స్‌లోకి అడుగు పెట్టనున్నారు.

హేమ డ్రగ్స్ తీసుకున్నారు


- మెడికల్ రిపోర్టులో రుజువైంది
- రేవ్‌పార్టీ కేసులో కోర్టుకు వెల్లడించిన పోలీసులు



బెంగళూరు నగరంలోని జీఆర్ ఫామ్‌హౌస్‌లో జరిగిన రేవ్ పార్టీలో తెలుగు నటి హేమ.. అలియాస్ కృష్ణవేణి డ్రగ్స్ తీసుకున్నట్టు పోలీసులు చార్జిషీట్‌లో పేర్కొన్నారు. విజయవాడకు చెందిన ఎల్ వాసు ఈ ఏడాది మే 19న జీఆర్ ఫామ్‌హౌస్‌లో రేవ్ పార్టీ నిర్వహించారు. ఈ పార్టీలో పాల్గొన్న హేమ.. ఎండీఎంఏ సేవించారని, ఆమె మెడికల్ రిపోర్టులు, సంఘటనా స్థలంలో సేకరించిన ఆధారాలు దాన్ని రుజువు చేస్తున్నాయని పోలీసులు చార్జిషీట్‌లో వెల్లడించారు. ఈ రేవ్ పార్టీకి డ్రగ్స్ సమకూర్చిన వారిలో డెంటిస్ట్ రణధీర్ బాబు కీలకంగా వ్యవహరించారని, అబూబకర్ సిద్ధిఖీ పార్టీకి వచ్చిన వారికి కొకైన్, ఎండీఎంఏ సరఫరా చేశారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో సీసీబీ పోలీసులు బెంగళూరు గ్రామీణ పరిధిలోని 8వ జిల్లా అదనపు సెషన్స్ కోర్టులో సోమవారం 1,086 పేజీలతో చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణతోపాటు 82 మంది సాక్షులను విచారించినట్లు అందులో పొందుపరిచారు. అర్ధరాత్రి జరిగిన పార్టీలో ఆంధ్ర, కర్ణాటకకు చెందిన ఫ్యాషన్ డిజైనర్లు, కళాశాల విద్యార్థులు, ప్రైవేట్ కంపెనీ ఉద్యోగులు పాల్గొన్నట్లు వార్తలు వెలువడ్డాయి. 27 మంది మహిళల సహా 79 మంది డ్రగ్స్ సేవించినట్లు ఫోరెన్సిక్ నివేదికలో తేలింది. ఆ వివరాలను పోలీసులు చార్జ్‌షీట్‌లో పొందుపరిచారు. డ్రగ్స్ తీసుకున్న 79 మందితోపాటు రేవ్‌పార్టీ నిర్వాహకులు 9 మంది కలిపి మొత్తం 88 మందిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కాగా, హేమ మాత్రం తాను డ్రగ్స్ తీసుకోలేదని, పోలీసులు తన బ్లడ్ శాంపిల్స్ కూడా సేకరించలేదని మొదటి నుంచీ చెబుతున్నారు. మీడియా కూడా తనను అనవసరంగా ఈ వివాదంలోకి లాగుతోందని ఆరోపించారు. తాను డ్రగ్స్ తీసుకున్నట్టు నిరూపిస్తే దేనికైనా సిద్ధమేనంటూ పలు ఇంటర్వ్యూల్లో ఆమె చెప్పారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

వేట మొదలైంది



హీరో నాని 32వ సినిమా 'హిట్.. ద థర్డ్ కేస్' రెగ్యులర్ షూటింగ్ శుక్రవారం మొదలైంది. డాక్టర్ శైలేష్ కొలను దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో హిట్ ఆఫీసర్ అర్జున్ సర్కార్‌గా నాని నటిస్తున్నారు. ఈ ఫెరోషియస్ కేరెక్టర్ కోసం నాని పూర్తిగా మేకోవర్ అయ్యారు. తొలి రోజు షూటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. వచ్చే ఏడాది వేసవిలో మే ఒకటిన ఈ సినిమాను విడుదల చేస్తామని నిర్మాత ప్రశాంతి తిపిర్నేని చెప్పారు. ఈ సినిమాకు ఛాయాగ్రహణం: సాను జాన్ వర్గీస్, సంగీతం: మిక్కీ జే మేయర్, ఎడిటింగ్: కార్తిక శ్రీనివాస్, ప్రొడక్షన్ డిజైనర్: నాగేంద్ర తంగాల. లైన్ ప్రొడ్యూసర్: అభిలాష్ మాంధపు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఎస్.వెంకటరత్నం.

బావ.. బావమరిది



తమిళ హీరోలు కార్తీ, అరవింద్ స్వామి నటించిన చిత్రం 'సత్యం.. సుందరం'. ఇంతకుముందు '96' చిత్రాన్ని రూపొందించి ప్రశంసలు అందుకొన్న సి.ప్రేమ్‌కుమార్ ఈ సినిమాకు దర్శకుడు. సూర్య, కార్తీ నిర్మించిన ఈ సినిమాను ఈ నెల 28న ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ తెలుగు ప్రేక్షకులకు అందిస్తోంది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో కార్తీ అమాయకత్వంతో కూడిన రస్టిక్ క్యారెక్టర్ చేస్తే, అరవింద్ స్వామి రిజర్వ్‌డ్, అర్బన్ పర్సనాలిటీగా కనిపించారు. 'బావా.. బావా' అంటూ అరవింద్‌స్వామి వెంటపడుతూ ఆట పట్టించే టిపికల్ పాత్రను కార్తీ పోషించారు. వీరిద్దరూ పాల్గొన్న సన్నివేశాలతో రూపొందించిన టీజర్ అలరించింది. ఈ పాత్రలను దర్శకుడు అద్భుతంగా ప్రజెంట్ చేశారు. శ్రీదివ్య, స్వాతి కొండే, దేవదర్శిని ముఖ్య పాత్రలు పోషించారు మహేంద్రన్ జయరాజ్ ఛాయాగ్రహణాన్ని, గోవింద్ వసంత సంగీతాన్ని అందించారు.

ఈసారి మహారాణి?



విజయ్ సేతుపతి కథానాయకుడిగా నటించిన 'మహారాజ' చిత్రం ఘన విజయంతో అటు పరిశ్రమ, ఇటు ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు దర్శకుడు నితిలన్ స్వామినాథన్. ఆయన దర్శకత్వం వహించబోయే కొత్త చిత్రంలో నయనతార లీడ్‌రోల్ పోషిస్తున్నట్లు, ఆ చిత్రానికి 'మహారాణి' అనే టైటిల్‌ను అనుకుంటున్నట్లు కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మహిళా ప్రాధాన్య కథాంశంతో తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నయనతార పాత్ర కొత్తతరహాలో ఉండబోతోందని కోలీవుడ్ సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. 'మహారాజా' చిత్రాన్ని నిర్మించిన ప్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుధన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



చంద్రబోస్‌కు పొన్నం సత్తయ్య జీవన సాఫల్య పురస్కారం


పిల్లలను వారి అభిరుచులకు అనుగుణంగా ఆయా రంగాల్లో ప్రోత్సహించి ఉన్నత స్థాయికి చేర్చిన గొప్ప వ్యక్తి పొన్నం సత్తయ్య అని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తండ్రి పొన్నం సత్తయ్యగౌడ్ 14వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పొన్నం సత్తయ్యగౌడ్ పురస్కారాలను ప్రదానం చేశారు. సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డుగ్రహీత చంద్రబోస్, బలగం ఫేమ్ కొమురమ్మ, మొగులయ్యలకు ఈ పురస్కారాలు ప్రదానం చేశారు. అవార్డు గ్రహీతలకు 51వేల రూపాయల నగదు పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పురస్కారగ్రహీతలను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి కథ మరోసారి

తెల్లదొరలకు ముచ్చెమటలు పట్టించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు కథను హీరో కృష్ణ అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించిన సంగతి విదితమే. ఈ వీరుని కథ మరోసారి తీయడానికి ఆర్.వి.వి. సత్యనారాయణ పూనుకున్నారు. అల్లూరి జీవిత చరిత్రలో యథార్థ సంఘటనల్ని ప్రజలకు అందించాలనే సంకల్పంతో 'మన్యం ధీరుడు' పేరుతో రూపొందించిన ఈ సినిమాలో అల్లూరి పాత్రను సత్యనారాయణ పోషించారు. నరేశ్ డెక్కల దర్శకత్వంలో ఈ సినిమా రూపుదిద్దుకుంది. అరకు, పాడేరు, హిమాచల్ ప్రదేశ్, కశ్మీర్‌లో షూటింగ్ చేశారు. భారీ ఖర్చుతో ఒక ఊరినే నిర్మించి అక్కడ కీలక సన్నివేశాలను చిత్రీకరించామనీ, బానిస సంకెళ్లు తెంచుకుని బ్రిటీష్ తెల్లదొరల పాలనకు చరమగీతం పాడే సన్నివేశాలు అద్భుతంగా వచ్చాయనీ నిర్మాత సత్యనారాయణ చెప్పారు. ఈ నెల 20న సినిమాను విడుదల చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.



మనసున్న తల్లి కథ



ఓ మధ్యతరగతి తల్లి చుట్టూ తిరిగే కథతో 'తల్లి మనసు' చిత్రం రూపుదిద్దుకుంటోంది. ప్రముఖ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో ఆయన తనయుడు కిశోర్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు వి. శ్రీనివాస్ (సిప్పి) దర్శకుడు. 'హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటివరకూ జరిగిన షూటింగ్‌లో రెండు పాటలతో సహా 80 శాతం చిత్రం పూర్తయింది. ఇంకో పాట, మిగిలిన టాకీ పార్ట్ చిత్రీకరించడంతో ఈ నెలాఖరుకు షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. మా నాన్న చిత్రాల స్థాయికి తగ్గట్టుగా చక్కటి కథ, కథనాలతో సినిమా తీస్తున్నాం. ఇటువంటి కథాబలం ఉన్న మంచి చిత్రాన్ని తీస్తున్నందుకు సోషల్ మీడియా ద్వారా మంచి స్పందన లభిస్తోంది. అభినందనలు అందుతున్నాయి' అని నిర్మాత తెలిపారు. ఓ మధ్యతరగతి తల్లి పడే తపన, సంఘర్షణను ఇందులో ఆవిష్కరిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. సింగిల్ షెడ్యూల్‌లో చిత్ర నిర్మాణం పూర్తి చేస్తున్నట్లు ముత్యాల సుబ్బయ్య తెలిపారు.

వరద బాధితులకు విరాళం



'జెట్టి' సినిమాతో హీరోగా మంచి పేరు తెచ్చుకున్న నటుడు, '100 డ్రీమ్స్' పేరుతో ఎనిమిదేళ్లుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కృష్ణ మానినేని వరద బాధితుల సహాయం కోసం రూ. పది లక్షల విరాళం ప్రకటించారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలసి అందజేశారు కృష్ణ. '100 డ్రీమ్స్' ఫౌండేషన్ ద్వారా ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలను విని, మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని పవన్‌కల్యాణ్ కోరారు

ధైర్యంగా ముందుకు రండి

నటి రోహిణి



కోలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ అంశంపై ఫిర్యాదు చేసేందుకు వీలుగా నడిగర్ సంఘం ఆధ్వర్యంలో 2019లో ఏర్పాటు చేసిన విశాఖ కమిటీ ముందు బాధితులు బారులు తీరుతున్నట్లు ఆ కమిటీ అధ్యక్షురాలు, సినీ నటి రోహిణి తెలిపారు. ఈ విషయంపై ఆమె శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. 'సినిమా అవకాశాల పేరుతో లైంగిక వేధింపులు ఎదుర్కొన్న అనేకమంది యువతులు కూడా ఫిర్యాదులు చేస్తున్నారని, వాటిపై సమగ్రంగా విచారణ జరుపుతున్నామని, ఆ విచారణ తర్వాత తదుపరి చర్యలపై ఆలోచన చేసి, ఓ నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఇక లైంగిక వేధింపులపై ఫిర్యాదులు చేసిన వారి వివరాలను బహిర్గతం చేయమని, చిత్రపరిశ్రమలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్నవారు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని రోహిణి సూచించారు. ఇదిలా ఉండగా, హీరోయిన్ల గురించి యూట్యూబ్ చానెల్‌లో ఇష్టానుసారంగా, అసభ్యకరంగా మాట్లాడిన డాక్టర్ కాంతరాజ్ అనే వైద్యుడిపై నటి రోహిణి నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

స్వర్గధామం.. నరకప్రాయం

- అంతిమ సంస్కారాలకు అంతులేని అవస్థలు
- బొబ్బిలిలో శ్మశాన వాటిక దుస్థితి
- ఏళ్ల గడుస్తున్నా పూర్తికాని పనులు


మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించేందుకు అవస్థలు పడుతున్న దృశ్యం

బొబ్బిలి

జీవితాంతం ఎన్నో కష్టాలకోర్చి బతికిన మనిషికి తనువు చాలించాక, ఆఖరి మజిలీలో కూడా ఇక్కట్లు తప్పడం లేదు. దహన సంస్కారాలు జరిపే శ్మశాన వాటికలో సైతం సరైన సదుపాయాలు లేక మృతదేహాలను తరలించడం కూడా సాధ్యంకాక మృతుల కుటుంబసభ్యులు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొంది. ఇదీ బొబ్బిలి స్వర్గధామం దుస్థితి..

● తనువు చాలించిన వారి మృతదేహాలకు అంతిమ సంస్కారాలు చేయడం వారి బంధువులకు పెద్ద చిక్కుగా మారింది. పట్టణ పరిధిలోని భైరిసాగరం చెరువులో 5 ,6, 7, 8, 3 వార్డులకు సంబంధించిన శ్మశానవాటిక ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి స్థానికులు ఈ శ్మశానవాటికను వినియోగిస్తున్నారు. వేసవిలో మరణించేవారికి అంతిమ సంస్కారం గౌరవప్రదంగా సాగుతున్నా వర్షాలు కురిసేటప్పుడు ఎవరైనా తనువు చాలిస్తే వారి పరలోక పయనానికి ఎన్నెన్నో అవస్థలు పడాల్సి వస్తుంది.

● భైరిసాగరం చెరువు ఆక్రమణలు, ఇతరత్రా కారణాలతో శ్మశానవాటిక పూర్తిగా నీటితో నిండి ఉంటుంది. పీకల్లోతు నీరు చేరుతుంది. దీనితో మృతదేహాలను రోడ్డుపైనే ఖననం, దహనం చేయాల్సి వస్తోంది. తుపాన్ ప్రభావంతో నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నందున రోడ్డుపైన కూడా అంతిమసంస్కారాలు చేసే వీలు లేకుండా పోయింది. దీనితో వేరే గత్యంతరం లేక ఇతర వార్డులకు చెందిన శ్మశానవాటికలకు మృతదేహాలను తరలించాల్సి వస్తోంది. సెంటిమెంట్ పరంగా ఇది సంబంధిత కుటుంబాలవారికి బాధాకరమైన విషయమే అయినప్పటికీ తప్పని దుస్థితి.

● ఈ శ్మశాన వాటిక అభివృద్ధి కోసం 13, 14 ఆర్థిక సంఘం నిధుల నుంచి 14 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. ఈ నిధులతో శ్మశానవాటిక దశ మారుతుందని ఐదువార్డుల ప్రజలు ఎంతో సంతోషించారు.


ఐదు వార్డులకు చెందిన శ్మశానవాటిక

పదిలక్షల రూపాయలు ఖర్చు చేసి శ్మశానవాటికకు స్వాగత ద్వారం, కొంతమేర ప్రహరీ నిర్మించి వదిలేశారు. ఈ పనులతో ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు అధికారులు దృష్టిసారించడం లేదు. ఈ వార్డులకు అనేక మంది దాతలు ముందుకొచ్చి లక్షలాది రూపాయలను పోగు చేసి శ్మశానవాటికను స్వర్గధామంగా తీర్చిదిద్దుకుంటామని భరోసా ఇస్తున్నప్పటికీ అధికారులు అందుకు సహకరించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. చెరువులోని నీరు పెద్దఎత్తున వాటికలోనికి ప్రవేశిస్తుండడంతో అందులోకి పూర్తిగా వెళ్లలేని పరిస్థితి నెలకొంటోంది.

వందలసార్లు మొత్తుకున్నాం..

నిధులున్నా శ్మశానవాటిక పనులను పూర్తి చేయడం లేదు. చైర్మన్లు, కమిషనర్లు మారిపోతున్నారు. శ్మశానవాటిక తలరాత మాత్రం మారలేదు. కౌన్సిల్ సమావేశాల్లోనే కాకుండా వ్యక్తిగతంగా అధికారుల ముందు నాతో పాటు నాలుగువార్డుల కౌన్సిలర్లంతా కలిసి వందలసార్లు మొర పెట్టుకున్నాం. దాతలు ముందుకొచ్చి లక్షల రూపాయలు పోగు చేసి అభివృద్ధి చేసుకుంటామన్నా సహకరించడం లేదు. ఆర్థికసంఘం నిధులు ఇంకా రూ.4 లక్షలు ఉన్నా వాటిని ఖర్చు చేయడం లేదు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకొని శ్మశాన వాటిక పనులు పూర్తి చేయాలి.

-వెలగాడ హైమావతి, మున్సిపల్ కౌన్సిలరు

గంజాయి విక్రయదారుల అరెస్ట్


పట్టుబడ్డ గంజాయి విక్రయదారులతో సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైం: నగరంలో వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయదారులను అదుపులోకి తీసుకుని వారి వద్దనుంచి 2.250 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సి.ఐ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. నగరానికి చెందిన సంతోష్, వి.విజయ్, లోహిత్, చందు, మరో జువైనల్ శుక్రవారం ఎంజీ రోడ్డులోని నిర్మాణంలో ఉన్న జగన్నాథ ఆలయంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావటంతో సీఐ శ్రీనివాస్, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు సంతోష్ ఒడిసా రాష్ట్రం రాయఘడ్ నుంచి గంజాయిని నగరానికి తీసుకువచ్చి విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడించారు. జువైనల్‌పై భోగపురంలో మరో కేసు ఉన్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి గంజాయితో పాటు, రూ.950 నగదును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ● జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 5.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ బాలజీరావు తెలిపారు. తమిళనాడుకు చెందిన ఆనంద్ సెల్వన్‌దొరై ఒడిసా నుంచి తమిళనాడుకు తరలిస్తుండగా తనిఖీల్లో పట్టుబడినట్లు తెలిపారు. గంజాయిని స్వాధీనం చేసుకుని, కేసునమోదు చేసి రిమాండ్‌కు తరళించినట్లు ఎస్.ఐ తెలిపారు.

నదిలో పడి రెండు ఎడ్లు మృతి

శృంగవరపుకోట రూరల్: మండలంలోని కొట్టాం గ్రామంలో నదిలో చిక్కుకుని రెండు ఎడ్లు మృతి చెందాయి. గ్రామానికి చెందిన ధర్మవరపు కోటరావు ఇసుక సేకరణ కోసం తన టైరుబండిని నదిలో దింపాడు. ఇసుక సేకరణ అనంతరం బండికి కట్టిన పశువులను ఒడ్డుకు తోలాడు. ఈ సమయంలో నదిలో ఇసుక కోసం తవ్విన గోతుల్లో రెండు పశువులు పడిపోయి నీటిలో చిక్కుకున్నాయి. దీంతో ఊపిరి ఆడక అందులోనే మునిగి చనిపోయాయి. వెంటనే స్థానికులు వచ్చి బండిని, ఎడ్లను బయటకు తీశరు. ఏరు వదిలి రెండురోజులు కాకముందే ఇసుక అమ్మకంపై ఆత్యాశతో సదరు వ్యక్తి ఇలా చేయడం వల న రెండు మూగ జీవాలు తనువు చాలించాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

వినాయక నిమజ్జనంలో ఘర్షణ

● టీడీపీ వర్గీయులపై వైసీపీ కార్యకర్తల దాడి

జామి: మండలంలోని గొడుకొమ్ము గ్రామంలో వినాయక విగ్రహాల అనుపులో భాగంగా ఘర్షణ చోటుచేసుకుంది. ఘటనలో ఒక యువకుడు గాయపడ్డాడు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వైసీపీ వర్గీయులు వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. ఇందుకు సంబంధించి గురువారం రాత్రి అనుపు ఉత్సవం నిర్వహించారు. అయితే ఈ సమయంలో మండపానికి ఎదురుగా కూర్చున్న టీడీపీ వర్గీయులపై తారాజువ్వ పడింది. దీంతో ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగి కొట్లాటకు దారి తీసింది. ఈ దాడిలో సతీష్ అనే యువకుడు గాయపడ్డాడని తెలిపారు. వెంటనే ఇరువర్గాలు జామి పోలీస్ స్టేషన్‌కు వెళ్లాయి. ఈ విషయంపై ఎస్ఐ వీరబాబును వివరణ కోరగా రాత్రి ఇరువర్గాల వారు వచ్చారని, దీనిపై గ్రామానికి సిబ్బందిని పంపించి సమాచారం సేకరిస్తున్నామన్నారు.

ఐదు ఇసుక ట్రాక్టర్లు సీజ్

రేగిడి: మండలంలో బొడ్డవలస నదీతీరంలో అక్రమంగా తరలిస్తున్న ఐదు ఇసుక ట్రాక్టర్లను శుక్రవారం పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి ఎస్ఐ నీలావతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొడ్డవలస వద్ద నాలుగు మండలాలకు తాగునీటిని అందించే రక్షితసోర్స్ ఉండగా, దీని సమీపంలో క్వారీలు తీసి అక్రమరవాణాకు తెగబడుతున్నారు. దీనిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు నిర్వహించిన తనిఖీల్లో ఇవి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడినట్లు వెల్లడించారు. ఇకపై బొడ్డవలస రక్షిత సోర్స్ వద్ద నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచి, ఇసుక అక్రమరవాణాని కట్టుడిచేస్తామని ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి

కురుపాం: దాడి ఘటనలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. కురుపాం గ్రామంలోని గౌడువీధి సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై కురుపాం ఎస్ఐ షణ్ముఖరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కురుపాం గ్రామానికి చెందిన గౌడు లల్లు అలియాస్ రవి.. శుక్రవారం తెల్లవారుజామున నిద్రలో ఉన్న అదే గ్రామానికి చెందిన గౌడు శ్రీధర్ తలపై రాడ్డుతో మోదాడు. దీంతో శ్రీధర్ తీవ్రంగా గాయపడ్డాడు. వీరి మధ్య గత కొంతకాలంగా గొడవలు ఉన్నాయి. గాయపడిన శ్రీధర్‌ను హుటాహుటిన కురుపాం ఆసుపత్రికి తరలించగా పార్వతీపురం రిఫర్ చేశారు. అక్కడ కూడా పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

ఆక్రమణపై ఫిర్యాదు

లక్కవరపుకోట: మండలంలోని తామరాపల్లి రెవెన్యూలో సర్వే నెంబరు 13లో కొంతభూమి ఆక్రమణ చేశారని తహసీల్దార్ ప్రసాదరావుకు తామరాపల్లి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే సర్వేనెంబర్ ఆక్రమణకు గురైందని ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చింది. వెంటనే హెచ్చరిక బోర్డులు పాతారు. అయినా పట్టించుకోని ఆక్రమణదారులు మరింత తెగించి దుక్కుచేసి పంటలు వేసేందుకు సిద్ధమయ్యారు. దీనిపై తహసీల్దార్ ప్రసాదరావు విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎస్‌కోటలో ఫ్లెక్సీల వివాదం

శృంగవరపుకోట: ఎస్.కోట మేజర్ పంచాయతీ పరిధిలో ఫెక్సీల వివాదం నెలకొంది. స్థానిక దేవిబొమ్మ కూడలిలో ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. శనివారం జరగనున్న తాజా మాజీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు జన్మదిన ఫ్లెక్సీల ఏర్పాటుకు ఈ ఫ్లెక్సీలను గురువారం తొల గించారు. దీంతో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒబ్బిన సత్యనారాయణ అభ్యంతరం చెప్పారు. పంచాయతీ అధికారులను నిలదీశారు. సర్పంచ్ గనివాడ సంతోషి కుమారికి ఫోన్ చేశారు. సీఐ నారాయణమూర్తికి ఫిర్యాదు చేశారు. శుక్ర వారం ఆందోళన చేపట్టేందుకు జనసేన నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఇదిలాఉండగా జనసేన నేత సత్యనారాయణ తనతో గౌరవం లేకుండా మాట్లాడారని సర్పంచ్ సంతోషికుమారి ఆరోపించారు.

కొట్లాటలో నలుగురికి గాయాలు

సంతకవిటి: మండలపరిధిలోని మండవకురిటి పంచాయతీలో గురువారం రాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండవకురిటి పంచాయతీ పరిధి అన్నమరాజపురం గ్రామానికి చెందిన ఒక వర్గంపై మండవకురిటి వాసులు దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో అన్నమరాజపురం గ్రామానికి ఒకే వర్గానికి చెందిన నలుగురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని రాజాం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అన్నమరాజపురం ఘర్షణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆర్. గోపాలరావు తెలిపారు.

గొంతెండుతున్నా పట్టించుకోరా?

తెర్లాం: తమ గ్రామంలో వాటర్‌స్కీం పనిచేయడం లేదు.. జలజీవన్ మిషన్ పనులు పూర్తి కాలేదు.. బోర్లు పనిచేయడం లేదు.. గొంతెండుతున్నా పట్టించుకోరా.. అని పెరుమాళి గ్రామ సర్పంచ్ హేమలత అధికారుల్ని నిలదీశారు. ఎంపీపీ ఉమాలక్ష్మి అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో గ్రామ సమస్యల్ని ఆమె లేవనెత్తారు. దీంతో పెరుమాళిలో తాగునీటి ఎద్దడి ఉన్న విషయం వాస్తవమేనని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరి అంగీకరించారు. రాజాం నుంచి పైపులైన్ ద్వారా గ్రామానికి తాగునీటి సరఫరా చేసేలా ఎమ్మెల్యే బేబీనాయన దృష్టికి తీసుకువెళ్లామని, ఉన్నతాధికారులతో చర్చించి సమస్య పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు ఆయన వివరించారు. కాగా, ప్రభుత్వ పథకాలపై జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలో 17 వేల ఎకరాల వ్యవసాయ భూములకు సంబంధించి ఈక్రాప్ నమోదు చేశామని ఏవో సునీల్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేకాధికారి రామారావు, ఎంపీడీవో రామకృష్ణ, పలు శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

వరద బాధితులకు కూరగాయల సరఫరా

కలెక్టరేట్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జిల్లా నుంచి రెండో విడత కూరగాయలు వాహనం శుక్రవారం బయలదేరింది. జిల్లాలోని పలు రైతు బజార్ల నుంచి సేకరించిన ఉల్లి, బంగాళదుంపలు, క్యాబేజీ, వంకాయలు, మిరప, దొండ, అరటి తదితర కూరగాయలను వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో పంపించారు. కలెక్టరు కార్యాలయం వద్ద వాహనాన్ని జేసీ సేతు మాధవన్ ప్రారంభించారు.

27న తపాలా అదాలత్

అరసవల్లి: తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న ఉదయం 11.30 గంటలకు పోస్టు మాస్టర్ జనరల్ కార్యా లయం (విశాఖ)లో తపాలా అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయన గరం, విశాఖ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల పరిధిలోని వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను ఈ నెల 23వ తేదీ లోగా '115వ తపాలా అదాలత్' అను శీర్షికతో కేవీడీ సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టు మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, విశాఖ- 530017 అనే చిరునామాకు పంపాలని కోరారు.

ఎస్పీ గ్రీవెన్స్ రద్దు

విజయనగరం క్రైం: రాష్ట్ర ప్రభుత్వం ఈద్-మిలాద్ ఉన్ నబీ పండుగ కారణంగా సోమవారం గ్రీవెన్స్ రద్దు చేస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించాల్సిన పబ్లిక్ గ్రీవెన్స్‌ను రద్దు చేస్తున్నామని, ఆ రోజున ప్రజలు కార్యాలయానికి రావొద్దని ఆయన సూచించారు.

ఏపీఎన్‌జీవీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

రింగురోడ్డు: ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఫెడరేషన్‌నూతన కార్యవర్గ ఎన్నికలను శుక్రవారం స్థానిక యూత్ హాస్టల్‌లో నిర్వహించారు. వెటర్నరీ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బొంగు కిశోర్, కార్యదర్శిగా పి.రామకృష్ణ, లైవ్ స్టాక్ అసిస్టెంట్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎల్. వాసుదేవరావు, కార్యదర్శిగా పి.చిన్నారావు, జూనియర్ వెటర్నరీ లైవ్‌స్టాక్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీ.హెచ్. తారకేశ్వరావు, కార్యదర్శిగా పి.అమర్నాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గసభ్యులను పశు సంవర్ధక శాఖ ఇంచార్జి జేడీ వైవీ రమణ అభినందించారు.

టెన్నీకాయిట్ జట్ల ఎంపిక

విజయనగరం టౌన్: శ్రీకాకుళం జిల్లా పలాసలో ఈ నెల 14 నుంచి 16 వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ టెన్నీకాయిట్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను జిల్లా కేంద్రంలోని రాజీవ్ క్రీడా మైదా నంలో శుక్రవారం ఎంపిక చేశారు. జిల్లా టెన్నీకాయిట్ సంఘ కార్యదర్శి ఎం.రామారావు ఆధ్వర్యంలో బాల బాలికల జట్లను ఎంపిక చేశారు. ఎంపికలను డీఎస్ డీవో వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ కార్యదర్శి కె. కృష్ణంరాజు, పీడీలు శివ, శ్రీను, తిరుపతి, గోపాల్, లక్ష్మి, శేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కోడూరు మాత యాత్రకు ఏర్పాట్లు పూర్తి

బాడంగి: ఏటా సెప్టెంబరు 2వ శనివారం జరుగుతున్న కోడూరుమాత యాత్రకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సీఐ నారాయణరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ శనివారం జరగనున్న కోడూరు మాత యాత్రకు నలుగురు ఎస్ఐలు, డీఎస్పీ తదితర వంద మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎటువంటి దొంగతనాలు జరగకుండా మఫ్టీలో రెండు బృందాలు జాతరలో తిరుగుతారని తెలిపారు. విజయనగరం జిల్లాతోపాటు ఒడిసా, శ్రీకాకుళం, విశాఖపట్టణం జిల్లాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారని సీఐ తెలిపారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

బొబ్బిలి రూరల్: బొబ్బిలి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యక్రమంలో భాగంగా జిల్లా తనిఖీ అధికారులు ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు తమ పరిశీలనలో గుర్తించిన అంశాలను సభలో వివరించారు. కార్యక్రమంలో ఏపీడీ లక్ష్మణరావు, జిల్లా విజిలెన్స్ అధికారి వెంకటరావు, వెలుగు ఏపీ రవి కుమార్, ఎస్ఆర్పీ మన్మథరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, పత్రికా విలేకర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బోరు ప్రారంభం

బొబ్బిలి రూరల్: మండలంలోని కోమటిపల్లిలో గల మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో శుక్రవారం ఎమ్మెల్యే నిధులతో స్థాపించిన హ్యాండ్ పంపును గ్రామ పంచాయతీ ప్రతినిధి గొట్టాపు సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై నెలలో ఎమ్మెల్యే దృష్టికి పాఠశాలలో ఉన్న నీటి సమస్యను తీసుకెళ్లామని, వెంటనే ఆయన స్పందించి ఎంపీడీవోకి ఆదేశాలిచ్చారని తెలిపారు. దీంతో ఆగస్టు నెలలో హ్యాండ్ పంపు, ప్లాట్‌ఫారం పని పూర్తి చేసి ఇప్పుడు ప్రారంభించారన్నారు.

మండల వ్యవసాయాధికారి క్షేత్ర పరిశీలన

బాడంగి: మండలంలోని వీరసాగరం, తెంటువలస, డొంకినవలస గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి శిరీష క్షేత్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంట నమోదు, ఈకేవైసీ పరిశీలించారు.

18న మెగా జాబ్ మేళా

కలెక్టరేట్: నెల్లిమర్ల నియోజకవర్గం పరిధిలో భోగాపురం మండలం, ముంజేరు గ్రామం వద్ద ఉన్న మిరాకిల్ ఎడ్యుకేషన్ సొసైటీలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 18న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. నెల్లిమర్ల శాసనసభ్యులు లోకం మాధవితో కలిసి కలెక్టర్ చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 29 ప్రముఖ కంపెనీల్లో 2500 పోస్టులను భర్తీ చేయడానికి ఇంటర్వ్యూలు జరుగుతాయని, జిల్లా నిరుద్యోగ యువతకు మంచి అవకాశామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 18 నుంచి 36 సంవత్సరాల మధ్య వయస్సు గల అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిప్లమో, డిగ్రీ, ఇంజినీరింగ్, పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన వారికి నెలకు 12 వేలు నుంచి 60 వేలు వరకూ జీతం లభిస్తుందని చెప్పారు. వివరాలకు 82971 92497, 80994 61303, 79956 91295 గల నెంబర్లకు సంప్రదించాలని చెప్పారు. జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి గోవిందరావు, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి తదితరులున్నారు.

విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

విజయనగరం రూరల్: విద్యార్థులు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగి ఎంతో మందికి ఉపాధి కల్పించాలని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. జేఎన్టీయూ గురజాడ విశ్వవిద్యాలయంలో ఫ్రెషర్స్‌డే ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి ప్రతి రోజు రెండు ఆలయాలను సందర్శించాలని, అందులో మొదటిది గ్రంథాలయం, రెండొవది క్రీడా ప్రాంగణం. మొదటది జ్ఞానాన్ని, రెండోది ఆరోగ్యాన్ని పెంచుతుందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని, వాటిని సమాజ అవసరాలకు ఉపయోగించి తద్వారా ప్రపంచ ప్రఖ్యాత సంస్థలను స్థాపించాలన్నారు. పదిమందికి ఉద్యోగాలు ఇచ్చే స్థితికి ఎదగాలన్నారు. కళాశాల ప్రధానాచార్యులు ప్రొఫెసర్ రాజేశ్వరావు, ఉపా ప్రధానాచార్యులు నాగరాజు, ఎం.సౌభాగ్యలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న గొంప కృష్ణ

శృంగవరపుకోట: ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకానికి దర ఖాస్తులు చేసుకోవాలని టీడీపీ అధికార ప్రతినిధి గొంప కృష్ణ కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం శృంగవరపుకోట కార్యా లయంలో ఈ పథకం గురించి కార్యకర్తలకు వివరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని సంప్రదాయక, చేతి వృత్తుల శ్రమికులకు హస్తకళల నిపుణులకు అండగా నిలవడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకంను అమలు చేస్తుందన్నారు. దరఖాస్తులు చేసుకోనేందుకు కార్యాలయంలో ఏర్పాటు చేస్తామన్నారు. రాయవరపు చంద్రశేఖర్, లగుడు రవికుమార్, గుమ్మిడి భారతి, రామసత్యం తదితరులున్నారు.

చెరువులు కబ్జా అవుతున్నా పట్టించుకోరా?

జామి: భీమసింగి గ్రామంలో ఉన్న చెరువు ఆక్రమణకు గురి కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్ జొన్నాడ వెంకటలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సమావేశంలో ఆమె మాట్లాడారు. చెరువు ఆక్రమణలు తొలగించాలని ఇరిగేషన్, ఆర్అండ్‌బీలను కోరినా స్పందన లేదన్నారు. దీనిపై జడ్పీటీసీ సరయూ మాట్లాడుతూ ఆక్రమణలు తొలగింపునకు అధికారులు సహకరించడం లేదని, అన్ని శాఖలు సమన్వయంతో సమస్యను పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా మండలంలో వెలుగుశాఖ తీరు బాగోలేదని మండలంలోని దాదాపు అందరు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. అన్నంరాజుపేట ఎంపీటీసీ విజయలక్ష్మి మాట్లాడుతూ ఎండీఎం నిర్వాహకులు నాణ్యతలేని భోజనం పెట్టడంతో విద్యార్థులు బడి మానేసి వెళ్లిపోతున్నారని తెలిపారు. రైతులకు నూతనంగా మంజూరు చేయనున్న పశువుల షెడ్లు అర్హులకు ఇవ్వాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. ఎంపీపీ అరుణ, ఎంపీడీవో సతీష్, తహసీల్దార్ కృష్ణలత, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.కోట మండల పరిషత్ అత్యవసర సమావేశం

శృంగవరపుకోట: ఎస్.కోట మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైఎస్ ఎంపీ పీలు ఇందుకూరి సుధారాజు, పినిశెట్టి వెంకటరమణ, సభ్యులు పాల్గొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేయాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు.

మా భూమిని కాపాడండి

రామభద్రపురం: మండల కేంద్రంలోని జాతీయ రహదారి పక్కన హైస్కూల్ ప్రహరీకి ఆనుకొని ఉన్న తమ భూమిని కొంతమంది కబ్జా చేస్తున్నారని, ఆ కబ్జాను నిలుపుదల చేయాలని మూడడ్ల ఆదిలక్ష్మి, అమృతా, మహలక్ష్మి కోరారు. శుక్రవారం జనసేన జిల్లా సహాయ కార్యదర్శి మహంతి ధనంజయ ఆధ్వర్యంలో కబ్జాకు గురవుతున్న స్థలాన్ని పరిశీలించి అనంతరం విలేకర్లతో మాట్లాడారు.

వరద బాధితులకు పలువురి వితరణ


బేబీనాయనకు చెక్కు అందజేస్తున్న స్థానిక వ్యాపారులు

బొబ్బిలి: విజయవాడ ప్రాంతంలో వరదల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు మానవతావాదులు ఆపన్న హస్తం అందజేస్తున్నారని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. కోటలో శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని పలు వర్గాల వారు వరదబాధితుల సహాయార్థం విరాళాలను ఎమ్మెల్యేకు అందజేశారు. శ్రీలక్ష్మీ బాలాజీ ప్రమోటర్స్ రెండు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఐఎంఏ తరపున డాక్టర్ ఎ.గోపీనాథ్-అక్కేన దివాకర్ రూ.1.10 లక్షలు, వ్యక్తిగతంగా రూ.25 వేలు, రూ.20 వేలు చొప్పున విరాళాలను అందజేశారు. బాడంగి మండలం భీమవరం సర్పంచ్, సీనియర్ నేత చప్ప తిరుపతినాయుడు రూ. 1.12 లక్షలు అందజేశారు. కోడిరామ్మూర్తి విద్యాసంస్థ అధినేత రంభ చంద్రశేఖర్ రూ. 50 వేలు, రామభద్రపురం మండలం ఆరికతోట టీడీపీ నాయకులు నల్ల కూర్మారావు, పల్లా చంద్రరావులు రూ. 50 వేలు, బొబ్బిలి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు రూ.30 వేలు తదతరులు మరిన్ని విరాళాలు అందజేశారు. టీడీపీ సీనియర్ నేత రౌతు రామ్మూర్తి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, మున్సిపల్ ఫ్లోర్ లీడరు గెంబలి శ్రీనివాసరావు, కింతలి బంగార్రాజు, సుంకరి సాయిరమేష్ తదితరులు పాల్గొన్నారు. **జామి:** జామికి చెందిన పాస్టర్ ప్రదీప్, అతని భార్య స్నేహాలు విజయవాడ, రాజ మండ్రి వరదబాదితులకు హైజనిక్ కిట్లు శుక్రవారం అందించారు. ● వరద బాధితులకు శుక్రవారం జామి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరణ కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థుల వితరణ భేష్: కలెక్టర్

కలెక్టరేట్: వరద బాధితులను ఆదుకునేందుకు విద్యార్థులు చూపిన చొరవను కలెక్టర్ అంబేడ్కర్ అభినందించారు. నెల్లిమర్ల మండలం జరజాపేట జెడ్పీ పాఠశాల విద్యార్థులు విజయవాడ వరద బాధితుల కోసం తమ వంతుగా చిరుసాయం అందించడంతో పాటు పలువురి దగ్గరి నుంచి విరాళాలను సేకరించారు. పాఠశాలలో ఉన్న సుమారు 200 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. వీరు సేకరించిన రూ.22,000ను కలెక్టర్ అంబేడ్కర్‌కు డీడీ ద్వారా శుక్రవారం అందించారు. కార్యక్రమంలో డీఈవో ప్రేమకుమార్, పాఠశాల హెచ్ఎం ఉన్నారు.

విశాఖ జట్టు భారీ స్కోరు

విజయనగరం టౌన్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం పట్టణ శివారు విజ్జీ క్రికెట్ మైదానంలో విజయనగరం, తూర్పుగోదావరి జట్ల మధ్య జరుగుతున్న మూడు రోజుల మ్యాచ్‌లో విజయనగరం తొలి ఇన్నింగ్స్‌లో స్వల్ప స్కోర్‌కే ఆలౌటైంది. తొలి రోజు బ్యాటింగ్ ప్రారంభించిన విజయనగరం జట్టు 52.1 ఓవర్లలో 127 పరుగులకే ఆలౌటైంది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన తూర్పుగోదావరి జట్టు ఆట ముగిసే నాటికి 4 వికెట్లు నష్టపోయి 106 పరుగులు సాధిఇంచింది. డెంకాడ మండలం చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో శ్రీకాకుళం, విశాఖ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో విశాఖ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు సాధించింది. 82 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 413 పరుగుల స్కోరు చేసింది.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం


ఎంపీపీని ప్రశ్నిస్తున్న చందులూరు ఎంపీటీసీ

లక్కవరపుకోట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం వాడీవేడిగా సాగింది. వైసీపీకి చెందిన స్వపక్ష సభ్యులే విపక్షమై ఎంపీపీపై ప్రశ్నల వర్షం కురిపించారు. అజెండా లేకుండా ఎంపీడీవో సమావేశం నిర్వహించడం విశేషం. వెలుగు కార్యాలయంలో వీవోఏలుగా గతంలో పనిచేసిన వారిని ఎలా తొలగించారని, ఏ ప్రాతిపదికన కొత్తవారిని నియమించా రని చందులూరు ఎంపీటీసీ యడ్ల కిశోర్ ఏపీఎం అప్పలనాయుడును ప్రశ్నించా రు. గ్రామ సంఘాల నిర్ణయం మేరకు కొత్త నియామకాలు జరిగాయని, అందులో డిపార్ట్‌మెంట్ ప్రమేయం లేదని ఏపీఎం సమాధానమిచ్చారు. గ్రామ సభలో ఉపాధి పనులపై తీర్మానం చేసి పంచాయతీల నుంచి పట్టుకెళ్లిపోతున్నారని, కనీసం ప్రజాప్రతినిధులకు సమాచారం లేదని రేగ ఎంపీటీసీ బొడ్డు గణపతి తెలి పారు. ఇప్పటివరకు అన్ని సెగ్మెంట్‌లలో మండల పరిషత్ నిధులిచ్చి కేవలం సంత పేట సెగ్మెంట్‌పై వివక్షత చూపడమేంటని సంతపేట ఎంపీటీసీ కె.సత్యవతి ఎంపీ పీని నిలదీశారు. ఇలా అయితే రాజీనామా చేస్తామన్నారు. గోల్డ్ స్టార్ పొల్యూ షన్‌పై ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని తామరాపల్లి సర్పంచ్ ఎం.భాస్క రరావు అధికారులను నిలదీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాదరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలు పూడ్చివేత

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి - గొల్లపల్లి రోడ్డు పాడయి రెండు రోజులుగా రాకపోకలకి అంతరాయం ఏర్పడిన నేపధ్యంలో శుక్రవారం రోడ్లు భవనంల శాఖ అధికారులు ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన వార్త ఎఫెక్ట్‌తో, స్పందించి రోడ్డుపై గ్రావెల్ వేసి రోడ్డు క్లియర్ చేసారు. రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు, పాదచారులు, ద్విచక్ర వాహనాలకు అటంకం కలగకుండా రాళ్ళు, మట్టి, గ్రావెల్ వేసి తాత్కాలిక చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కాకుండా ఏర్పాట్లు చేసారు.


రోడ్డుపై గ్రావెల్ వేసి రోడ్డు క్లియర్ చేస్తున్న దృశ్యం

సమీకృత వ్యవసాయ విధానంపై అవగాహన కల్పించండి


అధికారులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి పీవో

సీతంపేట: సమీకృత వ్యవసాయ విధానంపై గిరిజన రైతులకు అవగాహన కల్పించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం బుర్జిగూడలో ఆర్ఫ్ సంస్థ నాబార్డు సంయుక్తంగా నిర్వహిస్తు న్న సహజ వ్యవసాయ పద్ధతులతో సమీకృత వ్యవసాయ విధానాన్ని పరిశీలించా రు. ఈసందర్భంగా పీవో మాట్లాడుతూ రైతు వ్యవసాయ పద్ధతుల విధానాన్ని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల జీవన ప్రాజెక్టు కాటిల్‌షెడ్ పెంపొందించినట్టయితే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని, ఆ దిశగా దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్ర మంలో నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ దినేష్ రెడ్డి సీఈవో శంకరరావు, నూక సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: అరకులో నిర్వహిస్తున్న స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి శుక్రవా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. 7, 8, 9 తరగతుల్లో ప్రతి తరగతికి రెండు సీట్లు చొప్పున బ్యాక్‌లాగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల గిరిజన ఆశ్రమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు చొప్పున జోనల్ స్థాయిలో నిర్వహించే ఎంపికకు సంబంధిత వ్యాయామ ఉపాధ్యాయులు ఈనెల 17న విద్యార్థులను హాజరుపర్చాలని ఆయన తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

వీరఘట్టం: మండలంలోని యూటీఎఫ్ నాయకులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం స్థానిక ఎంఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడి రాజు మాట్లాడారు. సింగిల్ టీచర్ పాఠశాలలు కంబరవలస, కుమ్మరిగుంట, చలివేంద్రి, జె.గోపాలపురం, మహదేవివలస, పాపంపేట, వండువ, అడారు, నీలానగరం, విద్యార్థుల సంఖ్య 50 దాటిన ఎంపీపీఎస్ పాఠశాలలు కె.ఇచ్ఛాపురం, చిన్నగోర, 50 మంది విద్యార్థులు లోపు ఉన్న యూపీ పాఠశాలల్లో కిమ్మి, గడగమ్మ, తూడి పాఠశాలలకు వీరఘట్టం మండలంలో అదనంగా ఉన్న ఉపాధ్యాయులను డివిజన్‌లో కాకుండా మండలంలో సర్దుబాటు చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, మండల ప్రధాన కార్యదర్శి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం బియ్యం సేకరణ

కురుపాం రూరల్: విజయవాడ వరద బాధితుల కోసం నీలకంఠాపురం గ్రామంలో ప్రజల నుంచి బియ్యం విరాళంగా సేకరించారు. ట్రైబుల్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో 8 క్వింటాళ్ల బియ్యాన్ని, 3 వేల నగదును సేకరించారు. కలెక్టర్ ద్వారా బియ్యాన్ని, నగదును వరద బాధితులకు పంపనున్నట్టు సేకరణదారులు తెలిపారు. విరాళాల సేకరణలో నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు, నీలకంఠాపురం, మొండెంఖల్ సర్పంచులు మన్మథరావు, గౌరీశంకర్, టీడీపీ నాయకులు లాడి రమేష్, శంకర్, హాస్టల్ వార్డెన్ మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రహదారికి నిధులు మంజూరు చేయాలి


ఎమ్మెల్యే జగదీశ్వరిని సన్మానిస్తున్న కొత్తూరు గ్రామ ప్రజలు

గుమ్మలక్ష్మీపురం: తమ గ్రామంలో రహదారికి, శ్మశానవాటికకు నిధులు మంజూరు చేయాలని గరుగుబిల్లి మండలం కొత్తూరు గ్రామస్థులు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని కోరారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆమెకు కలిశారు. గ్రామ సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామంలో నిరుపయోగంగా ఉన్న చెరువును పూడ్చిపెట్టి, నిరుపేద దళితులకు ఇళ్ల స్థలాలుగా ఉపయోగపడేటట్టుగా చేయాలని కోరారు. సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.

'స్వచ్ఛతా హై సేవ'ను విజయవంతం చేయాలి

గరుగుబిల్లి: ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు స్వచ్ఛతా హై సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంపీపీ ఉరిటి రామారావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. అక్టోబరు 2న స్వచ్ఛ భారత్ దివస్‌గా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్వచ్ఛతా హై సేవాలో భాగంగా మండలంలో వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తారని, వీటిని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు, సర్పంచ్‌లు బి.మహేశ్వరరావు, కె.ఇందుమతి, కె.రవీంద్ర, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తిరుపతి భాస్కరరావు, ఆర్.శశిభూషణరావు, ఎ.లలితకుమారి, బి.సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన హిందీ పండిట్ శిక్షణ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ఆంధ్రప్రదేశ్‌తో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలో హిందీ పండిట్ శిక్షణా కళాశాలలు మూతపడిన పరిస్థితి ఏర్పడింది. గత తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు ప్రోత్సాహంతో విద్యాశాఖామంత్రిగా పనిచేసిన స్వర్గీయ ఆనంద గజపతిరాజు ఆధ్వర్యంలో జిల్లాలో మొట్టమొదటిసారిగా పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంగా రాజా హిందీ కళాశాల ఏర్పడింది. ఈ కళాశాల ద్వారా వేలాది మంది పండితులు తయారయ్యారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత హిందీ పండిట్ శిక్షణా కార్యక్రమానికి మంగళం పాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ కాకుండా ఇంగ్లీష్ భాషలోనే అని సబ్జెక్టులు బోధన చేయాలని ఆలోచనతో పూర్తిగా హిందీ పండిట్ శిక్షణా కార్యక్రమాలు వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. దీనివల్ల జిల్లాలో హిందీ పండిట్ శిక్షణా కార్యక్ర మాలు లేకుండా పోయింది. పార్వతీపురంతో పాటు పాలకొండలో హిందీ పండిట్ శిక్షణ కార్యక్రమాలు గతంలో ఉండేవి. ప్రస్తుతానికి ఈ శిక్షణ ఎక్కడా లేకుండాపోయింది. దీంతో హిందీ పండిట్ ఉపాధ్యాయ వృత్తి చేస్తున్న వారి సంఖ్య పూర్తిగా కనుమరుగవుతోంది. శనివారం దేశవ్యాప్తంగా హిందీ దివస్ నిర్వహిస్తున్నారు.

జిల్లాలో దేవదాయ శాఖ కమిషనర్ పర్యటన


వేదికపై కమిషనర్, కలెక్టర్

ఒడిశా

రాయగడ: జిల్లాలో దేవదాయ శాఖ కమిషనర్ రూపరోషన్ సాహు శుక్ర వారం పర్యటించారు. ఈసందర్భంగా స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె.. ముఖ్యమంత్రి కిసాన్ యోజన కింద ఎంతమంది రైతులకు లబ్ధి చేకూరిందనే విషయంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం కింద వివిధ బ్లాకులకు 39వేల ఫారాలు పంపిణీ చేయగా 3,204 మంది లబ్ధిదారులకు వాటిని అందజేసినట్టు తెలిపారు. అనంతరం జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత ఇల్లు, విద్యావ్యవస్థ, ఆరోగ్య సమస్యలు, రవాణా పరిస్థితి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పారుల్ పట్వార్, అదనపు కలెక్టర్ భాస్కరచంద్ర రోయిత్, జిల్లా ముఖ్య అభివృద్ధి, జిల్లా కౌన్సిల్ కార్యనిర్వాహక అధికారి నిహార్‌రంజన్ కహార్, సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి, గుణుపురం సబ్‌కలెక్టర్ కరణ్ దీప్‌కౌర్, వివిధ శాఖల అధికారులు తహసీల్దార్, సీడీపీవోలు హాజరయ్యారు.

సుభద్ర యోజనపై సమీక్ష

రాయగడ: సుభద్ర యోజన పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు శుక్రవారం స్థానిక జడ్పీ కౌన్సిల్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి అదనపు కార్యదర్శి ఉమేష్ చంద్ర త్రిపాఠి పాల్గొని, సుభద్ర యోజన కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. ఫారం అందజేయడం, నింపడం, ఫారం అపలోడ్ చేయడంపై చర్చించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్ రోయత్, జిల్లా కౌన్సిల్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నిహార్‌రంజన్ కహార్, అడిషనల్ పీడీ బిజయ్‌కుమార్ నాయక్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి దామప్రధాన్ మమత జిల్లా కోఆర్డినేటర్ హేమం త్, జిల్లాలోని అన్ని గ్రూపు డెవలప్‌మెంట్ అధికారులు, ప్రాజెక్టు అధికారులు పాల్గొన్నారు.

అత్యవసర సేవలకే పరిమితం

● కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల ఆందోళన


నల్లరిబ్బన్లతో విధులకు హాజరైన వైద్యులు

గరుగుబిల్లి: పీజీ, వైద్య విద్య ప్రవేశాల్లో ఇన్ సర్వీస్ కోటాను కుదించడాన్ని వ్యతిరేకిస్తూ వైద్యులు చేపట్టిన ఆందోళన కార్యక్రమం తీవ్ర రూపం దాలుస్తోంది. రాష్ట్ర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ఇచ్చిన పిలుపుమేరకు దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కేకే సాగర్‌వర్మ, ఎస్.సంతోష్‌కుమార్ నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలియజేయడంతో పాటు అత్యవసర వైద్య సేవలకు మాత్రమే పరిమితమయ్యారు. జీవో 85 ద్వారా తమ మూడేళ్ల సర్వీసుకు అర్థం లేకుండా పోయిందని, పీజీలో చదివే అవకాశాలు తగ్గించడం వల్ల తీవ్రంగా నష్టపోతామని వైద్యాధికారుల సంఘం ప్రకటించింది. గడిచిన రెండు నెలల నుంచి ప్రభుత్వానికి దశలవారీగా విజ్ఞప్తులు చేసినప్పటికీ పరిగణలోకి తీసుకోలేదన్నారు. ఈ నేపథ్యంలో 13వ తేదీన అత్యవసర కేసులు మాత్రమే చూశారు. ఈనెల 15వ తేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

బస్సు సర్వీసులు పునరుద్ధరించండి

● రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు


ఆందోళన చేస్తున్న విద్యార్థులు

మక్కువ: మక్కువ నుంచి పార్వతీపురం వెళ్లే ఆర్టీసీ బస్సు సర్వీసులు గత ఐదు రోజుల నుంచి నిలిపివేయడంతో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి హరికృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మక్కువ-చినభోగిలి రహదారిలో విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పార్వతీపురం నుంచి మక్కువకు మూడు బస్సు సర్వసులు ఉండేవని, రోడ్లు బాగోలేకపోవడంతో రెండు బస్సు సర్వీసులు నిలిపివేయడంతో విద్యార్థులు చాలీచాలని బస్సులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి నిలిపివేసిన బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు లోకేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై శ్రద్ధ వహించాలి

● 'మై స్కూల్ మై ప్రైడ్'లో భాగంగా పాఠశాలల పరిశీలన


పార్వతీపురంటౌన్: విద్యార్థులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

పార్వతీపురంటౌన్: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు విద్యాశాఖాధికారులకు సూచించారు. మై స్కూల్ మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన ప్రత్యేక అధికారి హోదాలో పట్టణంలోని టీఆర్ఎంఎం ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఎండీఎం అమలులో అజాగ్రత్త వహిస్తే కఠిన చర్యలు తప్పవని నిర్వాహకులకు హెచ్చరించారు. ● **వీరఘట్టం:** మండలంలోని అన్ని జడ్పీ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలకు ఒక అధికారిని నియమించారు. నెలలో రెండుసార్లు ఆయా పాఠశాలలను సందర్శించి విద్యార్థుల వివరాలు, పరీక్షల్లో వచ్చే మార్కులను పరిశీలించి విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇస్తారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంపీడీవో వెంకటరమణ వండువ జడ్పీ ఉన్నత పాఠశాలను, ఎంఈవో ఆనందరావు నీలానగరం జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉత్తీర్ణత శాతంలో మండలం జిల్లాలోనే ముందు ఉండాలనే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారు. ● **గరుగుబిల్లి:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనపర్చాలని ఎంపీడీవో జి.పైడతల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు సూచించారు. మండలంలోని గరుగుబిల్లి, తోటపల్లి, కొత్తూరు, మార్కొండపుట్టి, రావుపల్లి, ఉల్లిభద్ర పాఠశాలలను వారు శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మై స్కూల్, మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను పరిశీలించి, అవసరమైన సూచనలు అందిస్తున్నట్టు తెలిపారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయాలన్నారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● **మక్కువ:** పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని మండల ప్రత్యేకాధికారి అశోక్‌కుమార్ అన్నారు. సన్యాసిరాజపురం ఎంపీయూపీ పాఠశాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం డొక్కా సీతమ్మ, పీఎం పోషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్.సూర్యనారాయణ, ఎంఈవో పెంట సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా దృష్టి సారించండి

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది దృష్టి సారించాలని రావివలస ఎంపీటీసీ సభ్యుడు కోట భరత్‌కుమార్ సూచించారు. రావివలసలో నిర్వహిస్తున్న పారిశుధ్యం పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న దృష్ట్యా మురుగు నిల్వలు నెలకొనకుండా తొలగించాలన్నారు. క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. ఈ పరిశీలనలో సర్పంచ్ బి.అప్పుడు, కార్యదర్శి ఆర్.శశిభూషణరావు, ఎం.భాస్కరరావు, తదితరులు ఉన్నారు.

అదనపు కోర్టు మంజూరు చేయాలి

సాలూరు: సాలూరులో అదనపు కోర్టు మంజూరు చేయాలని, మూతపడి ఉన్న సబ్‌జైల్‌ను తెరిపించాలని స్థానిక న్యాయవాదులు శుక్రవారం రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా న్యాయవాదులు తిరుపతిరావు, చంద్రశేఖర్‌తో పాటు పలువురు మాట్లాడుతూ సాలూరు కోర్టులో మూడు వేలకు పైగా సివిల్, క్రిమినల్ ఇతర కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని సత్వరం పరిష్కారం చేయాలంటే మరో అదనపు సబ్‌కోర్టును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

మలేరియా జోనల్ అధికారిణి పర్యటన

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం మండలంలో జేకేశిల, పెద్దబండపల్లి, రావికోన తదితర ప్రాంతాల్లో జోనల్ అధికారిణి శాంతిప్రభ పర్యటించినట్టు మలేరియా శాఖ జిల్లా సహాయ అధికారి సూర్యనారాయణ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఆమెతో పాటు మలేరియా శాఖ అధికారులు పాల్గొన్నారని, ఈసందర్భంగా మలేరియా వ్యాధికి గురైన వారిని వారి ఆరోగ్య స్థితిగతులను తెలుసుకున్నట్టు ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా మలేరియా శాఖకు సంబంధించి ఉన్నతాధికారులు జిల్లాకు వచ్చినా కనీసం మీడియాకు సమాచారం అందించకుండా గోప్యంగా ఉంచుతుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

జీవో 22ను రద్దు చేయాలి

సాలూరు రూరల్: వ్యవసాయ విద్యుత్ మోటార్లు మీటర్లు బిగించాలనే జీవో 22ను తక్షణమే రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు జన్ని ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మరిపిల్లి గ్రామ సచివాలయ అధికారి లండ ప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే రైతులకిచ్చి ఆదుకోవాలన్నారు. పంటలకు సమగ్ర ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ వర్తింపచేయాలన్నారు.

అందరి సహకారంతో శ్యామలాంబ పండగ


సమావేశంలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి

సాలూరు: పట్టణ ప్రజలందరి సహకారంతోనే శ్యామలాంబ పండగకు శ్రీకారం చుట్టబోతున్నామని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. పట్టణంలోని యువరాజు ఇంట్లో శుక్రవారం పార్టీలకతీతంగా పట్టణ పెద్ద మనుషులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చే ఏడాది మే నెలలో నిర్వహించబోయే శ్యామలంబ పండగకు ప్రతిఒక్కరూ సలహాలు సూచనలు చేయాలని కోరారు. అందరి సహకారంతోనే పండుగను విజయవంతం చేయగలమని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సిగడాపు బంగారయ్య, వైసీపీ నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు, జనసేన నాయకుడు శివకృష్ణ, కౌన్సిలర్లు హాజరయ్యారు.

పేదల భూములకు సాగు పట్టాలు ఇవ్వాలి

మక్కువ: పేదల ఆధీనంలో ఉన్న భూములకు సాగు పట్టాలు ఇవ్వాలని, తూరుమామిడి జగనన్నకాలనీ ఇళ్లపై దర్యాప్తు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సుబ్బారావు డిమాండ్ చేశారు. శుక్రవారం మక్కువలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ షేక్ ఇబ్రహీంకు వినతిపత్రం అందించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగునాయుడు, ఇందిర పాల్గొన్నారు.

జీసీసీలో కలకలం

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర గిరిజన సహకార సంస్థలో ఖాళీగా ఉన్న వందకు పైగా పోస్టుల్లో ఇతర శాఖల వారిని డిప్యుటేషన్‌పై తీసుకురావాలన్న ఎండీ నిర్ణయంపై ఉద్యోగుల్లో అలజడి రేగింది. తమను కాదని ఇతర ప్రభుత్వ శాఖల వారిని డిప్యుటేషన్‌పై తీసుకురావడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వాలని, ఆ తర్వాత ఏర్పడ్డ ఖాళీలను భర్తీ చేయాలని జీసీసీ ఉద్యోగ సంఘాల నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం వారు విశాఖలో జీసీసీ మేనేజర్ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

క్లుప్తంగా..

పాచిపెంట ఎస్ఐగా వెంకట సురేష్

పాచిపెంట: పాచిపెంట ఎస్ఐగా వెంకట సురేష్ శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సాలూరు పట్టణ ఎస్ఐగా పనిచేస్తూ పాచిపెంట బదిలీ అయ్యారు. పాచిపెంట ఎస్ఐగా పనిచేసిన నారాయణరావు బదిలీపై జిల్లా కేంద్రానికి వెళ్లారు.

ఎరువుల దుకాణం తనిఖీ

సీతానగరం: మండల కేంద్రంలోని గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని వ్యవసాయం సహాయ సంచాలకుడు టి.వెంకటేష్ శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా పురుగు మందులు శాంపిల్స్‌ను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ సూచించారు. నాణ్యమైన కంపెనీ మందులు సరఫరా చేయాలని తెలిపారు.

వెలుగు సిబ్బందికి అండగా ఉంటాం

సాలూరు రూరల్: పేదల కోసం పనిచేస్తున్న వెలుగు సిబ్బందికి అండగా ఉంటామని డీఆర్డీఏ పీడీ వై.సత్యంనాయుడు అన్నారు. వెలుగు తోణాం క్లస్టర్ సీసీగా పనిచేసి మరణించిన కొర్లాపు ఈశ్వరరావు కుటుంబానికి ఉమ్మడి జిల్లాల వెలుగు సిబ్బంది శుక్రవారం ఆర్థిక సాయం అందించారు. ఉమ్మడి జిల్లాల వెలుగు డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు యరగడవలసకు వెళ్లి పీడీ చేతులమీదుగా రూ.1,05,500లను అందించారు.

కొఠియా సమస్యను పరిష్కరించాలి

సాలూరు రూరల్: కొఠియా సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఆయన విజయనగరంలో శుక్రవారం ఆమెను కలిసి ఈ సమస్యపై విన్నవించారు. ఏపీ, ఒడిశా గత సీఎంలు జగన్, నవీన్‌కుమార్ పట్నాయక్‌లు 2021 నవంబరు 9న కొఠియాపై ఏమి చర్చించారో ఇప్పటికీ మిస్టరీగా ఉందన్నారు. కొఠియా ఆధిపత్యానికి ఒడిశా దూకుడుగా వ్యవహరిస్తుందన్నారు. కొఠియా సమస్యను పరిష్కరించడానికి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాని ఆయన కోరారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన హస్తకళలు, వ్యాసరచన పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రథమ స్థానం లభించినట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం హేమసుందర్ శుక్రవారం తెలిపారు. కేంద్ర జౌళి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా క్రాఫ్ట్‌పై పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో రవీంద్రగౌతమ్, హెచ్‌ఎం వై.హేమసుందర్, ఉత్తరాంధ్ర హస్తకళల క్లస్టర్ కో-ఆర్డినేటర్ బి.అనీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కురుపాం: విద్యార్థి దశ నుంచే మొక్కలు నాటి, పర్యావరణాన్ని పరిరక్షించాలని తహసీల్దార్ రమణమ్మ అన్నారు. శుక్రవారం కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చిన సందర్భంగా ఆమె పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని పరిరక్షించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం టి.శంకరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేంద్రియ విధానాలతోనే తెగుళ్ల నివారణ

గరుగుబిల్లి: ఖరీఫ్ సమయంలో తెగుళ్ల నివారణకు రైతులు సేంద్రియ విధానాలను అమలుపర్చాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శ్రీనివాసరావు, వెంకట నాయుడు సూచించారు. తోటపల్లి యూనిట్ నందివానివలసలో శుక్రవారం వారు నీమాస్త్రం తయారీపై అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌లో వచ్చే తెగుళ్ల, పురు గుల నివారణకు నీమాస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నీమాస్త్రం తయారీకి 20 లీటర్ల నీరు, 10 కిలోల వేపాకులు, 15 లీటర్ల ఆవు మూత్రం తీసుకు ని పది రోజుల పాటు మరగబెట్టి, తదుపరి పిచికారీ చేస్తే పలు ఉపయోగాలతో పాటు ఖర్చు తగ్గుతుందన్నారు.

స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపు తగదు

● మండల పరిషత్ సమావేశంలో సభ్యుల ఆగ్రహం


సమస్యలపై ఎంఈవో, ఉపాధి ఏపీవోలను ప్రశ్నిస్తున్న సత్యనారాయణ


గరుగుబిల్లి: మండలంలో స్కూల్ కాంప్లెక్స్‌ల కుదింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని నాగూరు ఎంపీటీసీ సభ్యుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ కోరారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ స్కూల్ కాంప్లెక్స్‌లను కుదింపు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్న సమాచారం ఎందుకు తెలియపర్చలేదని ఎంఈవో ఎస్.నాగభూషణరావును నిలదీశారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు. ఉపాధి పథకంలో ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించాలన్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉపయోగపడే మొక్కలను, ప్రజా భాగస్వామ్యంతోనే నాటేలా దృష్టి సారించాలని ఏపీవో ఎం.గౌరీనాథ్‌కు సూచించారు. పంచాయతీల పరిధిలో వీధి దీపాలను ఏర్పాటు చేసే బాధ్యతను సచివాలయాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ సిబ్బందికి బాధ్యతలు అప్పగించాలని రావివలస ఎంపీటీసీ సభ్యులు కె.భరత్‌కుమార్, సత్యనారాయణతో పాటు సుంకి సర్పంచ్ కె.రవీంద్ర కోరారు. దీనిపై విద్యుత్‌శాఖ ఏఈ బి.శంకరరావు స్పందిస్తూ ప్రమాదాలు నెలకొనకుండా ఉండేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదభరితంగా తయారైందని సంతోషపురం సర్పంచ్ అంబటి తవిటినాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై జేఈ పి.ప్రమీల స్పందిస్తూ రహదారికై రూ.15 కోట్లుతో ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. మండలానికి సంబంధించి పలు అభివృద్ధి పనులకు రూ. 40 కోట్లుతో ప్రతిపాదనలు చేశామని పంచాయతీ జేఈ గౌరీశంకరరావు తెలిపారు. ఉపాధి ఏపీవో గౌరీనాథ్ మాట్లాడుతూ 25 పంచాయతీల పరిధిలో 3,113 పనులు గుర్తించామని, ఆమోదానికి జిల్లా అధికారులకు నివేదిస్తామని చెప్పారు. ఏవో ఆర్.విజయభారతి మాట్లాడుతూ మండలానికి 14 వేల ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తయిందని, ఈనెల 15లోగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీపీ రామారావు మాట్లాడుతూ సభ్యులు తెలియపర్చిన సమస్యలను సకాలంలో పరిష్కారమయ్యేలా అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సమావేశానికి ముందుగా కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి మృతికి సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు. సమావేశంలో ఎంపీడీవో పి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యలక్ష్మికుమార్, ఏవో ఎన్.అర్జునరావు, పి.శ్రావణి, రాజేష్, వి.అఖిల్‌నాయుడుతో పాటు పలు శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మండల స్థాయి పోటీలు

గరుగుబిల్లి: మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు శుక్రవారం మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ మేరకు ఉల్లిభద్ర జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు సంబంధించి అండర్-14, 17లో బాల బాలికలకు పలు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్-14, 17లకు సంబంధించి ఎంపిక నిర్వహించారు. పలు పాఠశాలల నుంచి సుమారు 310 మంది క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీల్లో గెలుపొందిన వారిని నియోజకవర్గ పోటీలకు పంపిస్తామని వ్యాయామ ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. హెచ్‌ఎంలు పాత్రుడు, సీహెచ్ శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, ఆర్.అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు. ● **సీతంపేట:** ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాల క్రీడల్లో బాలికలు మంచి ప్రతిభ కనబరిచారని ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్ తెలిపారు. శుక్రవారం స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, చెస్‌పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం టి.చంద్రరావు, పీఈటీలు పాల్గొన్నారు.


పాలకొండ: ఏచూరికి నివాళి అర్పిస్తున్న దృశ్యం


సాలూరు రూరల్‌లో..


భామిని: బాలేరులో..

ఏచూరి మృతి తీరని లోటు

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీవ్ర లోటని ఆ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లాలోని పలుచోట్ల ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

గిరిజనోద్ధారకుడిని కోల్పోయాం..

జియ్యమ్మవలస: దేశ చరిత్రలో గొప్ప గిరిజనోద్ధారకుడిని, ప్రజా ఉద్యమకారుడిని కోల్పోయామని కురుపాం మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు కంట తడిపెట్టారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పట్ల ఆయన శుక్రవారం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏచూరి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు.